

# పందాల జోరు

## గ్రేటర్‌లో జోరుగా సాగుతున్న బెట్టింగ్

లక్షల్లో బెట్టింగ్.. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎలక్షన్ టాఫిక్ నడుస్తుంది. ఈసమయాల్లో రాకీయాల గురించి చర్చించుకుంటూ బెట్టింగ్‌లు కాస్తున్నారు. కొందరు లక్షల్లో పందెం కాస్తే ..మరికొందరు ఫలితం తెలిసిన తర్వాత ఓడిపోయిన వారు దావత్ ఇవ్వాలనే షరతులు పెట్టుకుంటున్నారు. పోలీసులు ఇతర ప్రభుత్వ యంత్రాంగం కౌంటింగ్ పనుల్లో బిజీగా ఉండటంతో వీటిపై దృష్టి సారించలేకపోతున్నారు. ఇదే అదునుగా బెట్టింగ్ రాయుళ్లు విజృంభిస్తున్నారు.

### అభ్యర్థుల గెలుపోటములపై అంచనా

### ఏపార్టీ అధికారంలోకి వస్తుందంటూ పందెం

హైదరాబాద్, డిసెంబర్ 1,ప్రభాతవార్త: బెట్టింగ్, బుకీలు అనే మాటలు క్రికెట్ పోటీల సమయంలో తరచుగా వినబడుతుంటాయి. క్రికెట్ పోటీలపై కాసే బెట్టింగ్‌లలో ప్రపంచ వ్యాప్తంగా కోట్లు చేతులు మారుతుంటాయి.కానీ ఈఅసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వస్తారు..? ఎక్కడెక్కడ ఎవరు గెలుస్తారు..?కాబోయే ముఖ్యమంత్రి ఎవరంటూ బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. ఈక్రమంలో నియోజకవర్గాల్లోని అభ్యర్థిత్వాలపై ఇటు పార్టీలు, అటు ప్రజల్లో తీవ్రస్థాయి చర్చ జరుగుతోంది. దీన్ని క్యాష్ చేసుకున్న బెట్టింగ్ రాయుళ్లు అమాయకులను ఈఉచ్చులో దింపుతున్నారు. హాట్ సీట్లపై బెట్టింగ్‌లు కట్టిస్తూ కమీషన్లు గుంజుకుంటున్నారు. ఈసారి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు హోరాహోరిగా మారుతుండట ంతో బెట్టింగ్‌ల జోరు పెరిగింది. ప్రధాన పార్టీల నుండి బరిలో ఉన్న ప్రముఖులు పోటీ చేస్తున్న నియోజకవార్గలు హాట్ సీట్లుగా మారాయి. ఆయాస్థానాల్లో అభ్యర్థుల గెలుపోటములపై స్థానికంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భారీ మొత్తంలో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలన్నీ పూర్తి స్థాయిలో ఒకటికిక రెండు సార్లు ఆలోచించి..అన్ని సమీకరణాలు లెక్కలోని తీసుకుని గెలుపుగుర్రాలకే టికెట్లిచ్చి బరిలో నిలిపాయి. చాలా స్థానాల్లో బిఆర్ఎస్ -కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లుగానే పోటీ ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో బిఆర్ఎస్ -బిజెపి-కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య త్రిముఖపోటీ నెలకొంది. అలాగే గ్రేటర్‌లో ఆంధ్రా సెటిలర్ల ఓట్ల ప్రభావంపైనేనా బెట్టింగ్‌సాగుతున్నాయి. 2014 ఎన్నికల్లో ఎక్కువ మంది సెటిలర్లు టిడిపి-బిజెపి కూటమికి ఓట్లు వేయడంతో అప్పడు టిఆర్ఎస్‌కు సీట్లు తగ్గాయి. ఆఎన్నికలు రాష్ట్ర విభజన జరిగిన సమయంలో జరగడంతో ఆంధ్రులు టీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వలేదు... కానీ 2018 జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో సెటిలర్లు మూకుమ్మడిగా టీఆర్ఎస్‌వైపు మొగ్గు చూపారు. మరి ఇప్పు డేలా ఉంటుందనే దానిపై జోరుగా అంచనాలు వేసి పందాలు కాస్తున్నారు.



**బెట్టింగ్ ఇలా..** బిఆర్ఎస్ హాట్రిక్ కొడుతుందా? కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిన తర్వాత బోనీ కొడుతుందా? అంటూ భారీగా పందెం కాస్తున్నారు. మరోవైపు, కామారెడ్డిలో గెలిచేది కెసిఆరా? లేదా రేవంత్‌రెడ్డియా? గజ్వేల్‌లో విజయం కెసిఆర్ వర్తిస్తుందా? ఈటల రాజేందర్ వైపు జనం మొగ్గుచూపుతారా? కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి పరిస్థితి ఏంటి? నల్గొండలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజయం సాధిస్తారా? కెసిఆర్, కేటిఆర్, హరీష్‌రావుల మెజార్టీ ఎంత ఉండొచ్చు? ఇలా అనేక రకాలుగా బెట్టింగ్‌లు వేస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే విషయంతో పాటు టాప్ లీడర్ల గెలుపు, ఓటమిలపై కూడా అభ్యర్థుల వారీగా ఒకటికి మూడు రెట్లే ఇస్తాం ఒకటికి రెట్టింపు ఇస్తామంటూ పందెం కాస్తున్నారు బెట్టింగ్ రాయుళ్లు. అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎవరు ముఖ్యమంత్రి అవుతారు అనే అంశాల్లో పందాలు జోరుగా సాగుతున్నాయి.ఈపందాల్లో నియోజకవర్గాల్లోని వివిధ డివిజన్‌లలో పలుకుబడి ఉన్న నేతల నుండి ద్వితీయ శ్రేణి నాయకులు, రాజకీయాలంటే ఎంతో అసక్తి చూపే వివిధ వార్గాలకు చెందిన వ్యాపారవేత్తలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.



హైదరాబాద్ వార్త

# స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు



**నియోజకవర్గాల వారిగా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు**

- -అంబర్‌పేట-రెడ్డి ఉమెన్స్ కాలేజీ, నారాయణగూడ వైఎంసిఎ
- -ముషీరాబాద్-ఏవీ కాలేజీ, దోమలగూడ
- -ఖైరతాబాద్-కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడ
- -మలక్‌పేట-అంబర్‌పేట, ఇండోర్ స్టేడియం
- -జూబ్లీహిల్స్-కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడ
- -సనత్‌నగర్-కాలేజ్ ఆఫ్ కామర్స్, ఓయూ
- -నాంపల్లి-ఫైన్ ఆర్ట్స్ కాలేజీ, మాసబ్‌ట్యాంక్
- -కార్వాన్- గవర్నమెంట్ పాలిటెక్నిక్, మాసబ్‌ట్యాంక్
- -గోషామహల్-కోఠి ఉమెన్స్ కాలేజీ
- -చార్మినార్-కమల నెహ్రూ పాలిటెక్నిక్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
- -చంద్రాయణగుట్ట-నిజాం కాలేజీ, బషీర్‌బాగ్
- -యాకుత్‌పురా-వనతి మహావిద్యాలయం, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
- -బహదూర్‌పురా-అరోరా లీగల్ సైన్సెస్ అకాడమీ, బండ్లగూడ
- -సికింద్రాబాద్-పీజీఆర్ఆర్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఒయు
- -కంటోన్మెంట్-వెస్లీ కాలేజీ, సికింద్రాబాద్

హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త : పోలింగ్ ముగిసింది. ఇక, లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. గతంతో పోల్చితే ఈసారి ప్రతి పోలింగ్ బూత్ దగ్గర పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఓటింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో ఉంచారు. ఆయా పార్టీల అభ్యర్థులు గెలుపు ధీమాతో ఉన్నారు. ఇక డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు జరగనుండగా.. ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా,ఈవీఎంలను భద్రపరిచిన. స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్స్ దగ్గర 144 సెక్షన్‌తో పాటు మూడంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నారు. మొదటి అంచెలో పారామిలటరీ బలగాలు, రెండోస్థాయిలో సాయుధ సిబ్బంది, మూడో స్థాయిలో సివిల్ పోలీసులు భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా అగ్నిమాపక పరికరాలను సైతం అధికారులు అందుబాటులో ఉంచారు. ఇక ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భారీ భద్రత కొనసాగుతుంది. స్థానిక పోలీసులు, ఆర్మ్‌డే రిజర్వు, కేంద్ర బలగాలు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పరహారా కాస్తున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఉన్నవారికే స్ట్రాంగ్ రూమ్స్‌లోకి అనుమతి చేస్తున్నారు. ఇతరులకు ఎవరిని స్ట్రాంగ్ రూమ్‌లలోకి పర్మిషన్ ఇవ్వడంలేదు. ఇక ఈ స్ట్రాంగ్ రూమ్స్ దాగ్గర ఒక డిసిపి, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలతో పాటు ఇతర సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నారు.

**స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు ఇలా..** -స్ట్రాంగ్ రూమ్‌కి ఒకే ప్రవేశ ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. గదికి డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేయబడింది. మరియు ఒకటి దాని ఇన్‌చార్జితో, మరొకటి మేజిస్ట్రేట్ సాధికారత కలిగిన అధికారి వద్ద ఉంచబడుతుంది. -స్ట్రాంగ్ రూమ్ 24 గంటలూ సాయుధ రక్షణలో ఉంటుంది. సిసిటీవీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించబడుతుంది. -స్ట్రాంగ్ రూమ్ మూడంచెల భద్రతలో, మొదటి స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలను మోహరించారు. దీని కోసం కనీసం ఒక విభాగం (13 మంది) 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా ఒక ప్లాటూన్ (39 మంది) కేటాయించబడింది. -రాష్ట్ర సాయుధ పోలీసులు ద్వితీయ శ్రేణిలో మరియు సాధారణ పోలీసు సాయుధ బలగాలు మూడవ శ్రేణిలో మోహరించబడ్డారు. -స్ట్రాంగ్ రూమ్‌లో అమర్చిన సిసిటీవి కెమెరాలు, ఐసీసీసీ యొక్క కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు కనెక్ట్ చేయబడ్డాయి. ఇక్కడి సిబ్బంది దృశ్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు చర్యలు చేపట్టారు.



వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థుల ప్రదర్శన

### ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

హైదరాబాద్, డిసెంబరు 1,ప్రభాతవార్త: అంబిటస్ వరల్డ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. బౌరంపేట్‌లోని స్కూల్‌ప్రాంగణంలో "షేడ్స్ "పేరిట జరిగిన ఈ క్యాక్రమంలో విద్యార్థులు తమ సందేశాత్మక నృత్యాలు,కళా ప్రదర్శనలతో అలరించారు. దీనికి ముఖ్యఅతిధిగా ట్రాన్స్‌ప్లాట్ఫామ్‌డైరెక్టర్ మధుశ్రీ వేమురి, స్కూల్ డైరెక్టర్ నరేంద్ర ప్రసాద్‌లు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థుల తలిదండ్రులు, బంధువులు కార్యక్రమానికి తిలకించి హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రాణాధారమైన నీటి ప్రాముఖ్యతను,నీటికి కాపాడుకునే ఆవశ్యకతను తెలియజేయడానికి నీటి గీతాన్ని ఆలపించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ లలితానాయుడు మాట్లాడుతూ నేటి విద్యారంగంలో విద్యార్థుల అభిరుచి ఉన్న అన్ని కళారంగాల్లో వారిలోని ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీసి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు తమ పాఠశాల కృషి చేస్తుందని పేర్కొన్నారు.

### ఘనంగా ఈశ్వరిబాయి 105వ జయంతి



సైఫాబాద్, డిసెంబర్ 1 ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త జె.ఈశ్వరిబాయి 105వ జయంతి వేడుకలను ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆమె విగ్రహానికి పలువురు ప్రజా, కుల సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి, గీత స్పెషలిస్ట్ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ రామ చంద్రారెడ్డి, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఆర్పిఐ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.దురా ప్రసాద్‌లు కలిసి గతంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలకు ఈశ్వరిబాయి చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు.

### లక్ష్మణేశ్వర స్వామి ఆలయం కమిటి మాజీ చైర్మన్ మృతి



చార్మినార్, డిసెంబరు 1 ప్రభాతవార్త : పాతబస్తీ ఛత్రినాక సమీపంలోని శివగంగానగర్ శ్రీ లక్ష్మణేశ్వర స్వామి ఆలయం కమిటి మాజీ చైర్మన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అన్నా రావు కులకర్ణి (78) మృతి పట్ల పాతనగరానికి చెందిన పలువురు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.చార్మినార్ నియోజకవర్గం కాం గ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.వెంకటేష్,లాల్‌దర్వాజ శ్రీ మహాకాంళీ దేవాలయం కమిటి ప్రతినిధి అరవింద్ కుమార్ గౌడ్‌తో పాటు పాతబస్తీకి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,పలు దేవాలయాల కమిటీల ప్రతి నిధులు అన్నారావు కులకర్ణి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.కాగా నాలుగు రోజుల క్రితం అన్నా రావు కులకర్ణి సతీమణి అనారోగ్యంతో మృతి చెందారు. నాలుగు రోజులవ్యవధిలోనే భార్య భర్తలిద్దరు మృతి చెందటంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# గెలుపు ధీమాపై ఉత్కంఠ!

- ➢ విజయంపై అంచనాకు రాలేకపోతున్న అభ్యర్థులు
- ➢ బూత్‌ల వారీగా ఓటింగ్ విశ్లేషణ
- ➢ బూత్‌ఇంచార్జ్‌లు, నేతలతో సమీక్షా సమావేశాలు
- ➢ లీడర్లను గందరగోళానికి గురిస్తున్న సర్వేలు

నగర శివారులోని ఓ నియోజకవర్గానికి ఒక ప్రధానపార్టీ అభ్యర్థిగా ఆపేరును ప్రకటించగానే కార్యకర్తలు, స్థానికుల్లో చాలామంది విజయం పక్కా అనే నిర్ణయానికి వచ్చారు. కానీ ఆ అభ్యర్థికి అనుకూలంగా ఓటర్లున్నా.. వారిని పోలింగ్ కేంద్రం వరకూ తరలించడంలో కింది స్థాయి కేడర్ వైఫల్యం చెందినట్లు భావిస్తున్నారు. ఇప్పటివరకు మెజార్టీపై అంచనాలు వేసుకున్న అనుచరగణం.. ప్రస్తుతం ఎలాగైన బయటపడితే చాలానే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది.



హైదరాబాద్, డిసెంబరు 1,ప్రభాతవార్త: గెలుపుపై ధీమా ఉన్నా..మౌనంగా ఓటేసిన ఓటరు మనసులో ఏముందో తెలుసుకోలేక అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఓటరు నాడి తెలియక తికమక పడ్డ పార్టీలు ..పోలింగ్ అనంతరం ఎవరివైపు మొగ్గు చూపారనేది తేల్చుకోలేకపోతున్నారు. గురువారం పోలింగ్ ముగిశాక ..శుక్రవారం అధికశాతం అభ్యర్థులు బూత్‌లవారీగా ఓట్ల కూడికలు.. తీసివేతల పనుల్లో నిమగ్నమయ్యారు. ఊరిస్తున్న విజయం దక్కుతుందా.. లేదా?అనేఅంశంపై కసరత్తు చేస్తున్నారు. గెలిచేందుకు ఉన్న అనుకూలతలు, ఓటమికి గురిచేసే ప్రతికూలతలను లెక్కగడుతున్నారు. ముఖ్యంగా నగర శివారల్లలోని పలు నియోజకవర్గాల్లో ఊహకందని ఉత్కంఠ నెలకొంది. ఉప్పల్,ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్,మేడ్చల్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో కొందరు అభ్యర్థుల అనుచరులు ఓటింగ్ సరళిని అంచనా వేసేందుకు సర్వేలు నిర్వహించారు. డివిజన్‌కు 50-60 మంది ఓటర్ల నుంచి అభిప్రాయం సేకరించినట్లు సమాచారం. మహిళలు, పరుషులు, యువత,వృద్దులు ఎటువైపు మొగ్గుచూపారనే వివరాలు రాబట్టినట్లు తెలిసింది. మూడు సెగ్మెంట్లలో సామాజికవర్గాల వారీగా ఎవరెవరికి ఓట్లు పోలయ్యాయనే వివరాలను లెక్కగట్టినట్లు తెలుస్తుంది. అలాగే పాతబస్తీలోని మూడుస్థానాల్లో పరిస్థితులు తారుమారు అవుతాయంటూ సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారం సాగుతుంది. దీంతో గెలుపుపైన ధీమా ఉన్నవారిలోనూ ఒత్తిడి మొదలైనట్లు సమాచారం.

**ఎగ్జిట్‌పోల్స్‌లో పేరు లేకపోవడంతో ..** ఈసారి తనదే గెలుపు అని భావించిన అభ్యర్థులు పలుసర్వే సంస్థలు వెలువరించిన విజేతల జాబితాలో తనపేరు లేకపోవడంతో పలువురు అభ్యర్థులు ఇబ్బందులకు గురవుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ప్రధాన పార్టీలకు చెందిన కీకల నేతలు బరిలో ఉన్న స్థానాల్లో పోరు రసవత్తరంగా జరిగింది. పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ కొన్ని సానుకూల అంచనాలతో తనకు విజయం తథ్యమని పోలింగ్ ముగిశాక భావించారు. తీరా ..ఇప్పుడు పోలింగ్ కేంద్రాల వారీగా గణాంకాలు విశ్లేషించి ..చూస్తుంటే గెలుపు కష్టమనే అలోచనలు వచ్చినట్లు తెలుస్తుంది.

**ఎవరి అంచనాలు వాళ్లవి..మ** ఓటింగ్ సరళి ఎలా ఉన్నా ఎవరికి అంచనాలు వారికున్నాయి. కొన్నిచోట్ల పోలింగ్ శాతం తగ్గడం తమకు లాభం చేస్తుందని బిఆర్ ఎస్ శ్రేణులు అశాభావం వ్యక్తం చేస్తున్నాయి. వ్యతిరేక ఓటుతగ్గి ..అనుకూల ఓట్లు శాతం పెరిగిందంటూ లెక్కలు తేల్చుతున్నాయి. బస్తీవాసులు,వృద్దులు, మహిళల ఓట్లు గంపగుత్తగా తమకే పడ్డాయంటూ పేర్కొంటున్నాయి. కాంగ్రెస్,బిజెపి నేతలు పోలింగ్ సరళి తమకే అనుకూలంగా ఉందంటూ స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ, అభ్యర్థులపై వ్యతిరేక ఓట్లు తమకే పడ్డాయంటూ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. యువత, విద్యావంతులు, ఉద్యోగులు తమకే మద్దతు తెలిపారని తేల్చి చెబుతున్నారు.

### మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో

# పోలింగ్ ఆలస్యంతో పెరిగిన పోల్ ఓటింగ్ శాతం

**జిల్లా వ్యాప్తంగా 56.17శాతంకు**

**పెరిగిన పోలింగ్ నమోదు**

**3న కీసరలోని హోలీమేరి కళాశాలలోనే**

**5 నియోజకవర్గాల కౌంటింగ్ (ఓట్ల లెక్కింపు)**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 1, ప్రభాతవార్త : మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కొన్ని చోట్ల ఆలస్యంగ కొనసాగటంతో పోల్ ఓటింగ్ పోలింగ్ శాతం రాత్రి వరకు 56.17శాతం నమోదు జరిగింది. గురువారం సాయంత్రం 5గంటల వరకు 49.25శాతం పోలింగ్ నమోదు కాగ జిల్లా వ్యాప్తంగ పోలింగ్ పూర్తి వరకు 56.17శాతం నమోదు అయింది. అయితే గురువారం సాయంత్రం 5గంటల వరకు మాత్రం పోలింగ్ 49.25శాతంగ నమోదు కావటం జరిగిన సంగతి తెలిసిందే. అయితే సాయంత్రం 5గంటల తరువాత కూడ పలు పోలింగ్ కేంద్రాల్లో గేట్‌లోపల ఓటర్లు క్యూలో నిలబడి ఉండటంతో పోలింగ్ పూర్తి వరకు మరింత పోలింగ్ జరిగి జిల్లా వ్యాప్తంగ పోలింగ్ 56.17శాతం పెరిగినట్లు ఆలస్యంగ అధికారికంగ వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 6,37,839 మంది ఓటర్లు ఉండగ వీరిలో 3,96,790మంది ఓటర్లు ఓటు హక్కును (62.24శాతం) వినియోగించుకున్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మొత్తం 4,89,043మంది ఓటర్లు ఉండగ వీరిలో 2,64,189మంది తమ ఓటు హక్కును (54.02శాతం) వినియోగించుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 6,99,130మంది ఉండగ వీరిలో 3,99,752 మంది ఓటు హక్కును (57.18శాతం) మంది వినియోగించుకున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మొత్తం 4,63,864మంది ఓటర్లు ఉండగ వీరిలో 2,49,894మంది ఓటర్లు తమ ఓటు హక్కును (53.87శాతం) వినియోగించుకున్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 5,29,416మంది ఉండగ వీరిలో 2,72,870మంది ఓటు హక్కును (51.54 శాతం) వినియోగించుకున్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 56.17శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు ఆలస్యంగ వెల్లడించటం జరిగింది. మేడ్చల్ నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవిఎంలు మొరాయించటంతోనూ ప్రత్యామ్నాయంగా తీసుకవచ్చె వరకు పోలింగ్ ఓ గంట పాటు నిలిచిపోవటంతో, మరి కొన్ని చోట్ల అరగంట పాటు, 15నిమిషాల పాటు మొరాయించటంతో కొన్ని కేంద్రాల్లో సాయంత్రం 5గంటల తరువాత కూడ ఆలస్యంగ పోలింగ్ జరగటం, క్యూలైన్లలో బారులు తీరా నిలబడి ఉండటంతో ఓటింగ్ పోలింగ్ ఆలస్యంగ కొనసాగింది. మరి కొన్ని చోట్ల పోలింగ్ సాంకేతిక సమస్యలతో నెమ్మదిగా కొనసాగటంతోనూ సాయంత్రం తరువాత కూడ గేట్ లోపల ఉన్న వారికి ఓటు హక్కును వినియోగించుకోవటానికి అవకాశం కల్పించారు. పోలింగ్ పూర్తి జరిగిన తరువాతనే ఆలస్యంగ పోలింగ్ శాతంను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగ ఓటర్లు 28,19,292 మంది ఓటర్లు ఉండగ వీరిలో 15,83,675 మంది ఓటు హక్కును (56.17శాతం) మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తరువాత అదే నవంబరు 30వ తేదీన రాత్రి ఈవిఎంలను ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు తరలించి అక్కడి నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి కీసరలోని హోలీమేరి కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు కాన్వాయ్ వాహనాలతో పోలీసు బందోబస్తు మధ్య ఈవిఎం యంత్రాలను తరలించటం జరిగింది. ఇక ఈ నెల 3వ తేదీన ఆదివారం కీసరలోని హోలీ మేరి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగనుంది.

## సైన్స్ ఆధ్యాత్మికతవైపు ఒక మార్గం

**ఆర్ట్‌ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్**



రవిశంకర్‌తో ఎఫ్‌ఎల్‌వో సభ్యులు

హైదరాబాద్, డిసెంబర్ 1,ప్రభాతవార్త: సైన్స్ అనేది ఆధ్యాత్మికతవైపు ఒక మార్గం అని ఆర్ట్ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ అన్నారు. ఈమేరకు శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఓహోటల్‌లో ఫిక్కి లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఆధ్యాత్మికతకు శాంతి,అవగాహన,చురుకుదనం అవసరమన్నారు. సైన్స్ ఆధ్యాత్మికత రెండూ ఒక దానికొకటి పరిపూరకమైనవన్నారు. పర్యావరణ స్పృహ గురించి మాట్లాడుతూ ఒత్తిడికి గురైన వ్యక్తి పర్యావరణాన్ని పట్టించుకోడని ..పర్యావరణాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి ఒత్తిడి లేని మనస్సు,ప్రశాంతమైన, సంతోషకరమైన మనస్సు కావాలన్నారు. ప్రపంచశాంతి కోసం ఆధ్యాత్మిక పాత్రపై మాట్లాడుతూ ప్రపంచం చాలా సంఘర్షణలను ఎదుర్కొంటుందని హింసాత్మక సంఘర్షణలు, నెలకొన్నాయని ఈనేపథ్యంలో అక్కడ శాంతిని నెలకొల్పేందుకు రాయబారులకు పెద్దసవాలు మారిందన్నారు. ఆర్ట్ ఆఫ్‌లివింగ్ మనశ్శాంతిని ఇవ్వడమే కాకుండా ఉపశమనం కలిగిస్తు జీవితంలో ముందుకు సాగడానికి మరింత శక్తినిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఎల్‌వో చైర్‌పర్సన్ రీతుషా పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న చిక్కడపల్లి సిఐ



వీల్‌చైర్‌లో ఉన్న వయోవృద్ధులకు
తోడ్పాటును అందిస్తున్న చిక్కడపల్లి సిఐ సీతయ్య

చిక్కడపల్లి, డిసెంబరు 1 ప్రభాతవార్త: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో పలు పోలింగ్ కేంద్రాలలో ఓటు వేయడానికి వచ్చిన వృద్దులు, వికలాంగులతో పాటు పోలింగ్ కేంద్రాలకు వచ్చినా ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్న వారికి ఎన్నికల విధుల్లో ఉన్న స్థానిక సిఐ సీతయ్య సహాయం చేశారు. ఎన్నికల సక్రమంగా జరగడానికి విధులు నిర్వర్తించడంతో పాటు ఓటు వేయడానికి వచ్చి ఇబ్బంది పడుతున్న వృద్దులకు, నడవలేని వారివారికి సహాయం చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. దీంతో స్థానికులు పోలీసులు చేపడుతున్న కార్యక్రమాన్ని హర్షించారు.

### శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తా

చిక్కడపల్లి, ఆగస్టు 4 ప్రభాతవార్త: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని చిక్కడపల్లి సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు(ఏసీపీ)గా నూతనంగా పదవీ బాధ్యతలను స్వీకరించిన మధుమోహన్‌రెడ్డి అన్నారు.

# జనవరి 13,14 తేదీల్లో 'బంజారా కాంక్లేవ్'

## మాజీ ఎంపి రవీంద్ర నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాయక్, రవినాయక్

హైదరాబాద్, డిసెంబర్ 1,ప్రభాతవార్త: బంజారా యువతను అన్నిరంగాల్లో చైతన్యపరిచేందుకు జనవరి 13,14తేదీల్లో రెండు రోజులుపాటు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో 'బంజారా కాంక్లేవ్ "పేరిట భారీ సదస్సును నిర్వహించనున్నట్లు దక్షిణ భారత్,మహారాష్ట్ర ,మధ్యభారత్ బంజారా సేవాలలాల్ సమితి( డిబియంబిఎస్ఎస్) ఫౌండర్ మాజీ ఎంపి రవీంద్రనాయక్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ డిబిఎంబిఎస్ జాతీయ కన్వీనర్ జి.రవినాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో కార్యక్రమ కరపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా రవీంద్రనాయక్ మాట్లాడుతూ ఈకాంక్లేవ్‌లో దేశంలోని అన్నిరాష్ట్రాల నుంచి బంజారా నేతలు పాల్గొంటారని తెలిపారు. ముఖ్యంగా సేవాలాల్ మహారాజ్ పర్యటించిన, పడావ్ చేసిన ప్రాంతాలు, 11రాష్ట్రాల్లో బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలపై రెండురోజులపాటు చర్చ జరుగుతుందన్నారు. అలాగే బంజారా గోర్బోలిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి బంజారా గోర్బోలి భాషాభివృద్ధికి పాటుపడటంతోపాటు, బంజారా నిరుద్యోగ యువతకు ఉద్యోగం, ఉపాధి, నిరుద్యోగ బృతి తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

# అరికెపూడి గాంధీకి అభినందనలు తెలిపిన రామకృష్ణ వీధి సంక్షేమ సంఘం సభ్యులు



కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 1, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన అరికెపూడి గాంధీని శుక్రవారం రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అరికెపూడి గాంధీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జనంపల్లి పురంధరరెడ్డి, కమిటీ సభ్యులు కార్తిక్‌రావు, తాండవ కృష్ణ, జి.ప్రసాద్, శ్రీధర్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో స్థానిక సంక్షేమ సంఘం వారు అందరూ కష్టపడి పనిచేశారని కృతజ్ఞతలు తెలిపారు.

# సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సికింద్రాబాద్ డివిజన్ కార్యదర్శిగా ప్రభురాజ్

హైదరాబాద్,డిసెంబర్ 1,ప్రభాతవార్త: సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి ప్రభురాజ్ నియమితులయ్యారు. శుక్రవారం సికింద్రాబాద్ కేంద్ర కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జనరల్ సెక్రెటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య ప్రభురాజ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రభురాజ్ మాట్లాడుతూ ప్రతికార్యాలయానికి వెళ్లి కార్మికుల సమస్యలపై చర్చించి నిరంతరం అధికారులు దృష్టికితీసుకెళ్ళి పరిష్కారం అయ్యేవిధంగా కృషి చేస్తానన్నారు. కార్మికులకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుని సంఘాన్ని మరింత పటిష్ట పరుస్తానన్నారు. ఈకార్యక్రమంలో జోనల్ మీడియా కోఆర్డినేటర్ రవిశంకర్ ముక్తేవి, సికింద్రాబాద్ డివిజనల్ ప్రెసిడెంట్ నాగెండ్ల వెంకట నర్సయ్య, డిప్యూటీ డిజిటల్ సెక్రెటరీ కొత్త మురళీకృష్ణ, కేంద్ర కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, వేగి మురళీకృష్ణ, పివివిరాజు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన బిఆర్ఎస్‌కు ఉసురు తగులుతుంది



పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ మహాసభ నేతలు

సైఫాబాద్, డిసెంబర్ 1 ప్రభాతవార్త : రాష్ట్రంలో 52 లక్షల మంది ఉన్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసిన బిఆర్ఎస్ పార్టీకి తమ ఉసురు తగులుతుందని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ ఎస్‌లో మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 14వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చొప్పరి శంకర్‌ముదిరాజ్ మాట్లాడుతూ, పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం తొలి అమరుడు పోలీస్ కిష్టయ్యకు దక్కాల్సిన గౌరవాన్ని ఇవ్వలేదని, తొలి అమరుడుగా ఆయన పేరు ప్రకటించలేదని, కిష్టయ్య పేరుపై జిల్లా, కళాశాల ఏర్పాటు చేయక పోవడం శోచనీయమన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమాన్ని విస్మరించిన పార్టీలకు ఈ ఎన్నికల ఫలితాలు గుణపాఠంగా నిలుస్తాయన్నారు. రేపు ఏర్పాటు చేయబోయే ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# షాపుకు వెళ్లిన విద్యార్థి అదృశ్యం



నేరేడ్‌మెట్ డిసెంబర్ 1 ప్రభాతవార్త: ఓ విద్యార్థి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డిఫెన్స్ కాలనీలో తల్లిదండ్రులతో కలసి నివాసముండే నిశ్చల్ చేతన్ రాపిరెడ్డి (16) నిర్మల్‌నగర్‌లోని భారతీయ విద్యాభవన్ కళాశాలలో 11వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీనా సాయంత్రం 6గంటలకు ఇంటి సమీపంలోని ఓ దుకాణానికి వెళ్ళి వస్తానని చేతన్ రెడ్డి తన అమ్మకు చెప్పి వెళ్ళి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లి నేరేడ్‌మెట్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



సైట్ 2లోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 1, ప్రభాతవార్త : బోరబండ సైట్ 2లోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో నాగేంద్ర శ్రీనువాస్ గురుస్వామి 18వ పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈపూజకు అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాధా కృష్ణ, సురేష్ గౌడ్, ఆలయ అధ్యక్షులు జి.లక్ష్మణ్‌గౌడ్, ఆలయ పూజారులు సురేష్, ప్రవీణ్, కమిటి సభ్యులు బాలకృష్ణ, విజయ్, సత్యనారాయణ, తివారి, సోమేష్, గోవింద్, రాజుగౌడ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ముందు అయ్యప్ప స్వాముల ధర్నా

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 1, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ స్కూల్ ముందు అయ్యప్పస్వాములు ధర్నా నిర్వహించారు. అయ్యప్ప మాల వేసుకున్న మౌతిక అనే విద్యార్థినిని ఉపాధ్యాయులు స్కూల్‌లోకి అనుమతించలేదు. స్కూల్ యూనిఫాం ఉంటేనే పాఠశాలకు రావాలని ఆదేశించారు. దీంతో అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున స్కూల్ ముందు చేరుకుని ధర్నా చేశారు. అయ్యప్ప మాల వేసుకుంటే స్కూల్‌కు ఎందుకు రానివ్వరని ఉపాధ్యాయులను నిలదీశారు. కర్రలతో గేటుపై దాడి చేశారు. మౌతికను అవమానపరిచినందుకు స్కూల్ యాజమాన్యం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అయ్యప్పలు, అయ్యప్ప భక్తులు హెచ్చరించారు. స్కూల్ ఆవరణలో అయ్యప్ప స్వాములు బయటాయించి, జై శ్రీరామ్.. అంటూ నినాదాలు చేశారు.

# రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్



కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 1, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్ శుక్రవారం టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ రేవంత్‌రెడ్డికి పూలబొకె అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. ప్రజలంతా తెలంగాణ వైపు చూస్తున్నారని ఈ ఎన్నికల్లో వారి మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు.

# అత్యాచార నిందితుడిని అప్పజెప్పాలి

## పోలీసుస్టేషన్ ముందు బస్తీవాసుల ఆందోళన



బోరబండ పోలీస్‌స్టేషన్ వద్ద న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న సాయిబాబా నగర్ బస్తీ వాసులు

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 1, ప్రభాతవార్త : రోజు రోజుకి ఈ సమాజం ఎటుపోతుందా అనిపిస్తుంది.. ఈసమాజంలో ఆడవాళ్ళకే కాదు ముక్కుపచ్చలారని చిన్నారులకు కూడా రక్షణ లేదు, ప్రభుత్వాలు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినా ఆడపిల్లలపైన జరుగుతున్న దారుణాలను అడ్డుకోలేక పోతుంది. ముళ్ళపొదల్లో ఇరుక్కున్న మేకపిల్లలా... ఇంట్లో, బయట ఎక్కడ చూసినా ఆడపిల్ల చుట్టూ శత్రువులే.. కన్నతండ్రి తన కూతురుపైనే అత్యాచారానికి పాల్ప డిన ఘటనలు, చిన్నారులపై ఆగాయిత్యానికి పాల్పడిన సంఘటనలు గతంలో ఎన్నో ఉన్నాయి. అలాంటి ఘటనే తాజాగా మరోసారి వెలుగు చూసింది. మానవ మృగం, చిన్నారిపైన అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈఘటన బోరబండలో చోటు చేసుకుంది. వివరాల లోకి వెలితే ఎనిమిదేళ్ళ బాలికపై బోరబండ చెందిన యువకుడు(22) గత మూడురోజుల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈవిషయాన్ని ఎవరికైన చెబితే బాలిక తల్లిదండ్రులను చంపుతానని బెదిరించాడు. ఈవిషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు ఆగ్రహంతో రగలిపోయారు. చిన్నారిపైన ఆకిరాతకుడు చేసిన ఆఘాయిత్యానికి ఆడపిల్ల తల్లిదండ్రులు కుమిలిపో యారు. చిన్నారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆయువకుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేప ట్టారు. ఇదిలా ఉండగా శుక్రవారం బాలిక తల్లిదం డ్రులతో పాటు, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్‌కు వెళ్ళి బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని తమకు అప్పచెప్పాలంటూ ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్‌లో సిఐ భూపాల్ గౌడ్ వాళ్ళకు నచ్చచెప్పి తగిన విధంగా న్యాయం జరిగేలా చూస్తామని నిందితుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు.

# ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ సందర్బంగా వాల్ పోస్టర్ విడుదల



గోషామహల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ఎయిడ్స్ రహిత సమాజం కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు యువజన సంఘాలు కృషి చేయాలని తెలంగాణ టిఎన్‌జిఓ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం హుస్సేనీ (ముజీబ్)అన్నారు. నాంపల్లిలోని టిఎన్‌జిఓ యూనియన్ హైదరాబాద్ కార్యాలయంలో నవ భారతి నిర్మాన్ ఫౌండేషన్ రూపొందించిన ఎయిడ్స్ హెచ్.ఐ.వి వాల్ పోస్టర్ ముజీబ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముజీబ్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి,ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపకుండా వారికి చేయూత అందించాలని,స్వచ్ఛంద సేవా సంస్థలు ఎయిడ్స్ వ్యాధి వల్ల కలిగే అనర్థాలను,ప్రజలకు, వివరించి వారిని చైతన్యపర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అన్ని చర్యలు తీసుకుని శిబిరాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్,నవభారతి నిర్మాణ్ ఫౌండేషన్ అధ్యక్షులు బత్తుల హేమంత్‌లు మాట్లాడుతూ కౌగిలింత,షేక్‌హ్యాండ్స్, తాకటం,ఇవ్వడం,వల్లన,హెచ్ఐవి, వ్యాపించదన్నారు. గాలి,నీరు. దోమ,కాటు వలన హెచ్.విఐ వచ్చే అవకాశంలేదన్నారు. ఈకార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్,ప్రచార కార్యదర్శి వైదిక్‌శాస్త్రి,వహిద్,కృష్ణ,నవీన్,మహమ్మద్ జీషాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈశ్వరీబాయి సేవలు మరువలేనివి : మాజీ మంత్రి గీతా రెడ్డి



ఈశ్వరీబాయికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 1 ప్రభాతవార్త: బడుగు బలహీన,అణగారిన వర్గాల కోసం ఈశ్వరీబాయి చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి తెలిపారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరీబాయి 105వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లి సెంట్‌జాన్స్ చర్చి చౌరస్తాలోని ఈశ్వరీబాయి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తమ తల్లి ఈశ్వరీబాయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు, పోరాటాలను గుర్తించి ముఖ్య మంత్రి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి గూడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, సికింద్రాబాద్ చిలుకలగూడ డివిజన్ నుంచి రెండు పర్యాయాలు కార్పోరేటర్‌గా పనిచేసి ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. తమ అమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ఎవరిపై ఆధారపడకుండా వారి కాళ్లపై వారు నిలబడేందుకు 1996లో ఈశ్వరీబాయి నర్సింగ్ కళాశాలను నెలకొల్పి వేలాది మందికి ఉపాధి కల్పిం చడం జరిగిందన్నారు. ఆ మహనుభావురాలు బిడ్డగా పుట్టడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ రాంచంద్రారెడ్డి, గీతా నర్సింగ్ హోం అడ్మిన్ మేఘనారెడ్డి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సి.హెచ్.బాలక్రిష్ణ,రాష్ట్ర అధ్యక్షులు మహేశ్ బాబు,రాష్ట్ర నాయకులు దయానంద్, దళిత సంఘాల నేతలు దేవదత్తు, ఉమేశ్ బాబు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే సీటు కోసం ఎవరికి వారే ధీమా

కంటోన్మెంట్, డిసెంబర్ 1 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో 47 శాతం పోలింగ్ అయ్యాయి. ఈ ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలువగా ప్రధాన పార్టీలకు చెందిన లాస్య నందిత (బిఆర్ఎస్), ఎన్.శ్రీగణేష్ (బిజెపి), డాక్టర్. జి.వి.వెన్నెల గద్దర్ (కాంగ్రెస్), అభ్యర్థుల మధ్యన జరిగిన ఉత్కంఠ పోటీల్లో ఎవరికి వారే తామే విజయం సాధి స్తామని దీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం లోని ఏఏ బస్తీలలో, ఏఏ పార్టీవైపు ప్రజలు ఓట్లు వేశారని, ఏ పార్టీకి ఓట్లు తక్కువ పడి ఉన్నాయని అంచనాలు వేసుకుంటున్నారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లాస్యకు కంటో న్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, శ్యామ్‌కుమార్, లోకనాథం, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్‌లతో పాటు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎన్నికల ఇన్‌ఛార్జిలు గజ్జెల నాగేశ్, ఎం.ఎన్.శ్రీనివాస్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, మోండా డివిజన్ మాజీ కార్పోరేటర్ ఆకులరూప హరిక్రిష్ణ,మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహ్మా ముదిరాజ్, బిఆర్ఎస్ నేత పెద్దాల నర్సింహ్మా యాదవ్‌లు లాస్య విజయానికి సంపూర్ణ మద్దతు తెలుపడం, సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్, ఆసరా పిం ఛన్లు, రైతు బంధు వంటి సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ప్రజలు తమకు ఓట్లు వేశారని తామే విజయం సాధిస్తా మని లాస్య అనుచరులు చర్చించుకుంటున్నారు. అదే విధంగా బిజెపి అభ్యర్థి ఎన్.శ్రీగణేష్ గత 15 సంవత్స రాల నుంచి కంటోన్మెంట్‌లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంతో నియోజకవర్గంలోని అన్ని వార్డులలో, బస్తీలలో శ్రీగణేష్ సుపరిచితుడు ఆయన గెలుపుకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, సదా కేశవరెడ్డి, బానుక నర్మధ మల్లికార్జున్, బిజెపి నేత బి.ఎన్.శ్రీనివాస్, మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామక్రిష్ణ, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉద్యోగి పరశరాములు, బిజెపి అభ్యర్థి శ్రీగణేష్ విజయానికి అహర్నిశలు కృషి చేశారు. దీంతో కంటోన్మెంట్‌లో తామే విజయం సాధిస్తామని బిజెపి నాయకులు, శ్రీ గణేష్ వర్గీయులు వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి.వి.వెన్నెల గద్దర్ తన తండ్రి ప్రజా గాయకుడు గద్దర్ బిడ్డగా పేరు పొందడం, రాష్ట్రంలో ప్రభుత్వం మార్చాలని ప్రజలు నిర్ణయించుకొని తమకే ఓటువేశారని, తమ గెలుపుకు అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించారని, ముఖ్యంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు తమకే మద్ధతు తెలిపారని, అందు వల్ల ఈఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని వెన్నెల వర్గీయులు వ్యక్తం చేస్తున్నారు.

**విశ్రాంతి తీసుకుంటున్న అభ్యర్థులు..** సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల నుంచి వివిధ పార్టీ నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, తమ కార్యకర్తలను వెంట పెట్టు కొని రాత్రింభవళ్లు వారి వారి గెలుపుకోసం పాటుపడ్డారు. గురువారం సాయంత్రం ఎన్నికలు ముగియడంతో శుక్ర వారం ఆయా పార్టీల నుంచి పోటీ చేసిన పద్మారావు గౌడ్ బిఆర్ఎస్, ఆదం సంతోష్ కుమార్ కాంగ్రెస్, మేకల సారంగపాని బిజెపి, అదే విధంగా కంటోన్మెంట్ నియోజ కవర్గం నుంచి పోటీ చేసిన బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత, బిజెపి అభ్యర్థి ఎన్.శ్రీగణేష్, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి.వి.వెన్నెల గద్దర్‌లు శుక్రవారం ఎలాంటి కార్యక్ర మాల్లో పాల్గొనకుండా వారి వారి ఇండ్లలో ్లనే ఉంటూ విశ్రాంతి తీసుకొని పోలింగ్ సరలి, ఓట్లపై మదిలో సర్వే చేసుకుంటూ ఆలోచనలో పడ్డారు.

# ఎయిడ్స్ అవగాహన ర్యాలీ

షాద్‌నగర్, డిసెంబర్ 1, (ప్రభాతవార్త) : డిసెంబర్ 1 ఎయిడ్స్ డేను పురస్కరించుకొని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో షాద్‌నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ ఆదేశానుసారం పట్టణ ముఖ్యకూడలీలో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ... ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాపించే విధానాలు, వాటిని అరికట్టే పద్ధతులను వివరించి ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ డాక్టర్ శ్రీనివాసులు, ఆప్తల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఐసీటీ సెంటర్ శ్యాంసుందర్, ఆశోక్, వైద్య సిబ్బంది మాధవి,ఝాన్సీ, శ్రీలత, శ్రీశైలం, ఆన్వర్, శ్రీధర్‌రెడ్డి, రవి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గెలుపు ఓటములపై తర్జన భర్జనలు

## మల్కాజిగిరి పార్టీలలో కనపడని గెలుపు ధీమా.. ఎగ్జిట్ పోల్స్‌తో కాంగ్రెస్‌లో కొంత ఉత్సాహం

అల్వాల్, డిసెంబరు 1 ప్రభాతవార్త: మల్కాజిగిరి రాష్ట్ర వ్యాప్తంగా వార్తలులో నిలిచిన నియోజకవర్గం. ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. బిఆర్ఎస్ నాయకత్వంపై ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి.మైనంపల్లిని ఓడించడానికి అధికార పార్టీ సర్వశక్తులు ఒడ్డింది. ఎన్నికల రణ రంగం ముగిసిన నేపథ్యంలో గెలుపు ఓటములపై పార్టీలలో తర్జన భర్జనలు కొనసాగుతున్నాయి. కచ్చితంగా గెలుస్తున్నామనే ధీమా ప్రధాన పార్టీలులో ఎక్కడా కానరావడం లేదు. కాంగ్రెస్‌కు అనుకూల ఫలితాలు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేసిన నేపథ్యంలో కాంగ్రెస్‌లో కొంత వరకు ఉత్సా హం కనపడుతుండగా ఎక్కడో తెలియని భయం వారిలో ఉంది. ప్రధానంగా బస్తీ ఓటర్లు బిఆర్ఎస్ వైపు మొగ్గు చూపారని పార్టీ అంతర్గత చర్చలులో కనిపించింది. కాంగ్రెస్ పరి స్థితి ఇలా ఉండగా బిఆర్ఎస్‌లో గెలుపై ధీమాగా ఉన్నట్లు ఎక్కడా లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా ఉందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్న నేపథ్యంలో నేతలు కార్యకర్తలులో అయోమయం కనపడుతోం ది. యువత, కాలనీ వాసులు ఈసారి ఓటింగ్‌కు భారీగా వచ్చిన కారణంగా గెలుపు తమను వరించే అవకాశాలు ఉన్నాయనేది భారతీయ జనతాపార్టీ వాదనగా ఉంది. ఈ పార్టీలోనూ గెలుపుపై స్పష్టత లేని పరిస్థితి. మూడు ప్రధాన పార్టీలు ఓటింగ్ సరళిని బట్టి ఎక్కడ ప్లస్ ఎక్కడ మైనస్ అనే కూడికలు తీసివేతలులో మునిగి ఉన్నాయి. బూత్‌లు వారీగా ఏజెంట్లు నుంచి సమాచారం సేకరిస్తున్నాయి. అనుకూల ప్రాంతాలు అనుకూ లంగా లేని వాటి పై లెక్కలు వేసుకుంటున్నారు. ఓటింగ్ సరళిని బట్టి త్రిముఖం తప్పనది ఎవరి గెలిచిన అత్యల్ప మెజారిటీతో బయట పడతారనే వాతావరణం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హవా ఉందనే అంచనాలు నిజమైతే కాంగ్రెస్ వియజ తీరాలకు వెళ్ళే అవకాశాలు మెండుగా ఉంటాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతానికి 2023 పోలింగ్‌కు పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదు. 2018 ఎన్నికలులో 53.08 శాతం ఓటింగ్ నమోదు కాగా ప్రస్తుతం 53.99 శాతం ఉంది. కేవలం .83 శాతం ఓట్లు అదనంగా పోల్ అయ్యా యి. 2018 ఎన్నికలులో బిఆర్ఎస్ తరుపున పోటీ చేసిన మైనంపల్లి హనుమంతరావుకు 55.49 శాతం, బిజెపి రామచంద్రరావుకు 19.31 శాతం, టిజెఎస్‌కు చెందిన దిలిప్ కుమార్‌కు 16.33 శాతం ఓట్లు లభించాయి. మైనంపల్లి హనుమంత రావు సుమారు 73,698 ఓట్లు మెజారిటీతో విజయం సాధించడం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు ఉన్నాయనే మీడి యా కథనాలుతో గత ఎన్నికలు కంటే సగానికి మెజారిటీ తగ్గినా గెలుపు తమదే అన్న అంచనా లను కాంగ్రెస్ వేసుకుంటోంది. మైనంపల్లి బిఆర్ఎస్‌లో ఉండగా మద్దతుగా నిలిచిన వారిలో కొంత శాతం టర్న్ ఉన్నా కలిసి వస్తుందనేది వారి ఆలోచన. కాంగ్రెస్ హవా, సొంత ఇమేజ్ లెక్కలు పక్కాగా ఉంటే మైనంపల్లికి విజయావకాలు ఉంటాయి. విజయంపై బిఆర్ఎస్ పైకి గంభీరం గా ఉన్నా అంతర్గతంగా ఏదో తెలియన భయం ఉంది. నియోజకవర్గంలోని బస్తీల ఓట్లు అధికంగా బిఆర్ఎస్‌కు వచ్చాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కేవలం బస్తీలు ఓట్లుతోనే గెలుపు సాధ్యం అవుతుందా అనేది కూడా అనుమానమే. కాంగ్రెస్ వైపు ఈ ఓటర్లు చూపు ఎంతో కొంత ఉంటుందనేది వాస్తవం. కాలనీ వాసులు, యువ ఓటర్లకు సంబంధించి బిజెపి వైపు మొగ్గు ఉంటుందనేది విస్పష్టం.

IN THE COURT OF THE II JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
O.S. No. 2646 of 2020

Between:
**M/s. State Bank of India,**
SME Centre Branch, Patny Centre, 1st Floor, Secunderabad - 500 003, Represented by its Chief Manager ...Plaintiff
And
**M/s. Icon Ads and another** ... Defendants
To
**1. M/s. Icon Ads,**
Rep. by its Proprietor Chand Khan Shaik, H.No.12-1-343/5, Near Water Tank, Dattatreya Nagar Colony, Asif Nagar, Hyderabad - 500 028.
**2. Chand Shaik Khan,**
S/O Mohd. Abdul Rahman, Aged Major, Occ: Business, R/O H.No.12-1-343/5, Near Water Tank, Dattatreya Nagar Colony, Asif Nagar, Hyderabad-500 028. ...Defendants

**SUMMONS**

Whereas the Plaintiff filed above suit under Section 26 and Order 7 Rules 1 and 2 of CPC against you for recovery of a sum of **Rs.7,23,222-00 Ps.** together with current and future interest, costs and for other relief's. You are therefore hereby directed to appear before the Hon'ble IIJunior Civil Judge, City Civil Court, at Hyderabad, either in person or through an Advocate or duly authorized agent, in support of defense to show cause on **13.12.2023 at 10.30 A.M.** as to why relief's prayed for should not be granted. Take notice that in case of default the matter will be heard and determined in your absence.

//By the order of the court//
**Sd/- Dr. C.S. CHAKRAVARTHY**
**Counsel for the Plaintiff**
Ground Floor, H.No.16-11-16/T/4, "Master's Nilayam", West Prasanth Nagar, Moosarambagh, Hyderabad - 500 036.
Phones: 9391046708, 7901240898

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT :: AT: L.B. NAGAR
E.P.No. 11 OF 2018
IN
O.S.No. 1665 OF 2007

Between :-
**K. Venkata Ramana** ...Decree-Holder
AND
**S. Nageshwar Rao** ...Judgement-Debtor

**NOTICE**

To,
**S. Nageshwar Rao S/o. Pochaiah**
Aged about 65 years, Occ: Business, R/o. H.No.5-1-414, Gouliguda, Hyderabad.
Please take notice that, the Decree-Holder in the above case filed the above EP against the Judgement-Debtor seeking for the relief of Proclamation of Sale of EP Schedule immovable property bearing Plot No.A34 admeasuring 266 Sq Yards or 222.41 Sq Meters in Sy.No.9/1 H, situated at Sarojini Nagar, Haripuri Colony, Saroor Nagar (V & M) under ward No.11, Block No.14, L.B. Nagar Circle No.3, GHMC, Ranga Reddy District and the said matter is posted to **14-12-2023** for your appearance before the above said Hon'ble court.
Hence, you are hereby summoned to appear before the above said the Hon'ble court on **14-12-2023 at 10.30. A.M.** either in person or through your advocate, failing which, the matter will be decided as per law.

// BY ORDER OF THE COURT//
**A. RAMULU**
**ANANTHA ANJANEYULU**
**Advocates**
**Chamber of Lawyers' Collective**
Plot No.70, D.No.3-11-413/2/NR, Above Karnataka Bank, 2nd Floor Near Kamineni Hospital 'X' Road L.B.Nagar, Hyd-74. **Cell: 9848264759**

**IN THE COURT OF HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.S NO. 944 OF 2023**
**Between :**
SMT, DARSHANA DEVI AGARWAL& OTHERS. **...Plaintiffs**
**And**
1. THE TEHSILDAR TRIMALGHERY MANDAL.
2. ALL CONCERNED. **.... DEFENDANTS**

**PUBLIC NOTICE**

To
All Concerned
This is to inform to general public that the Plaintiffs have filled suit for Declaration to declare them as Legal Heirs of deceased LATE HUKUM CHAND AGARWAL Who died on 21-01-2013, as such general public are hereby informed you that if anybody having any objection kindly appear before the above Hon'ble Court on 04-12-2023 at 10.30 A.M either in person or through Advocate. Failing which matter will be decided as per law.
Hence this notice.
**// BY ORDER OF THE COURT//**
**M B SANTOSH KUMAR.**
ADVOCATE
H.NO 3-41-1,
Ashwini nagar Colony,
West Marred pally,
Secunderabad 500026,
**Cell 9391358882.**

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.S. NO 954 of 2023**
**Between:**
PAYYALORE SAINATH & OTHERS. **...PLAINTIFFS**
**AND**
1. THE TEHSILDAR MARREDPALLY MANDAL
2. ALL CONCERNED. **...DEFENDANTS**

**PUBLIC NOTICE**

TO
ALL CONCERNED
This is to inform to general public that the Plaintiffs have filled suit for Declaration to declare them as Legal Heirs of deceased LATE GANTI VIJAYA DURGA Who died on 18-08-2023, As such general public are hereby informed you that if anybody having any objection kindly appear before the above Hon'ble Court on 04-12-2023 at 10.30 A.M either in person or through Advocate failing which matter will be decided as per law.
Hence this notice.
**// BY ORDER OF THE COURT//**
**M B SANTOSH KUMAR**
Advocate
H No 3-41-1,
Ashwini nagar Colony,
West married pally,
Secunderabad 500026
**CELL NO 9391358882**



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## మంత్రి హరీష్‌రావుకు మెజార్టీ పెరగడం ఖాయం

### బిఆర్ఎస్ నాయకుల ధీమా

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** సిద్దిపేట నియోజకవర్గం లో గురువారం జరిగిన పోలింగ్ సరళిని చూస్తుంటే బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి హరీష్‌రావుకు గతంలోకంటే ఈసారి మెజార్టీ పెరగడం ఖాయమని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు కడవెర్గు రాజ నర్సు, పాల సాయిరాం, జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వారు సిద్దిపేటలోని మంత్రి స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిద్దిపేటలో హరీష్‌రావు పోటీ చేస్తున్న ప్రతిసారి మెజార్టీ పెరగడం సాంప్రదాయంగా వస్తుందని, ఈసారి అదే కొనసాగు తుందన్నారు. ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్‌కు అన్నివర్గాల ప్రజల నుంచి చక్కటి స్పందన లభించిందన్నారు. స్వల్పంగా పోలింగ్ శాతం తగ్గినప్పటికీ హరీష్‌రావుకు మెజార్టీ పెరిగి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. హరీష్ రావు గెలుపుతోపాటు మెజార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి వారు కృత జ్ఞతలు తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్‌వి కౌన్సిలర్ వడ్లకొండ సాయి. నాయకులు మెరుగు మహేష్, జి.మోహన్‌లాల్, వజీర్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## హుస్నాబాద్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడిగా గిరిమల వంశీ



హుస్నాబాద్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన తిరిమల వంశీ

**హుస్నాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** హుస్నాబాద్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడిగా గిరిమల వంశీ ఎంపికయ్యారు. శుక్రవారం వార్షిక ఎన్నికల నిర్వహించిన సంఘం నూతన కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించింది. ఉపా ధ్యక్షులుగా ఠాకూర్ మనోహర్‌సింగ్, ప్రధానకార్యదర్శిగా సుంకరి శ్రీకాంత్, కార్యదర్శిగా కవ్వ శ్రావణ్‌రెడ్డి, కోశాధికారిగా దొడ్ల శ్రీధర్‌రెడ్డిలను ఎన్ను కున్నా రు. కార్యక్రమంలో గౌరవఅధ్యక్షులు జాల శ్రీనివాస్, పంతం నవీన్, సలహా దారులు ఏగురి రవిందర్‌రెడ్డి, కాశబోయిన ప్రశాంత్, బుర్ర ప్రవీణ్ పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా స్వామి



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**మిరుదొడ్డి, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఎలుముల స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉమ్మడి కాపు సంఘం అధ్వర్యంలో అలయ కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. అధ్యక్షులుగా ఎలుముల స్వామి, ఉపాధ్యక్షులుగా తోకల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శిగా స్వామి, సహాయ కార్యదర్శిగా తోట వెంకటరెడ్డి, కోశాధి కారిగా మహిపాల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా ఎలుముల స్వామి మాట్లాడుతూ అలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఉమ్మడి కాపు కులం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి కాపు కుల సంఘం సభ్యులు సత్తు మహిపాల్‌రెడ్డి, సిరినేని వెంకట్, గున్నాల భిక్షపతి, ముత్యం, కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి, లింగాల అంజిరెడ్డి, రాంరెడ్డి, మారుతి పాల్గొన్నారు.

## నేటి నుంచి కొండపోచమ్మ వార్షికోత్సవ వేడుకలు

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తీగుల్ నర్సా పూర్ గ్రామంలో వెలసిన శ్రీ కొండపోచమ్మ అమ్మవారి 22వ వార్షికో త్స వ వేడుకలు ఈనెల 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు గణపతి పూజతో ప్రారంభమై పుణ్యాహవచనము, అఖండ దీప స్థాపన, ఋత్వి క్వరణము, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనము, అభిషేకము నిర్వహించడం జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో వార్షికోత్స వ వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని తెలిపారు.

## శ్రీవిశ్వయోగి విశ్వంజీ మహరాజ్‌కు శ్రీగురుపీఠం శిలాన్యాసంకు ఆహ్వాన పత్రిక అందజేత



గుంటూరు శ్రీవిశ్వయోగి విశ్వంజీ మహరాజ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**శివ్వంపేట, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలో నిర్మించే శ్రీగురుపీఠం మందిర శిలాన్యాసం కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు నగరంలో శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్‌కు శ్రీ గురుపీఠం చైర్మన్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్, వేద పండితులు, మేనేజింగ్ ట్రస్టీ వెంకటేశ్వరశర్మల చేతుల మీదుగా ఆహ్వాన పత్రిక అందజేసి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివకుమార్‌గౌడ్, వెంకటేశ్వరశర్మలు మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీ ఉదయం 8.40 నిమిషాలకు దివ్యమైన ముహుర్తంలో శిలాన్యాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ శిలాన్యాసం శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ కర కమలములచే చేయడం జరుగు తుందని, అందుకు తగిన ఏర్పాట్లను చేయడం జరుగుతుందని వారు తెలి పారు. వారి వెంట ట్రస్టు ప్రధాన సభ్యులు మారెళ్ల మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

## నల్లపోచమ్మను దర్శించుకున్న సంజీవరెడ్డి

**మనూర్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని బోరంచ గ్రామంలో కొలువున్న శ్రీ నల్లపోచమ్మ తల్లి ఆలయాన్ని శుక్రవారం టిపిసిసి ఉపాధ్య క్షులు, నారాయణఖేడ్ శాసన సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పట్లోళ్ల సంజీవరెడ్డి పార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నా రు. ఆలయానికి చేరుకున్న సంజీవరెడ్డిని ఆలయ అర్చకులు ఆలయ మ ర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమం లో నాయకులు మల్లారెడ్డి, పండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోరంచ నల్లపోచమ్మను దర్శించుకుంటున్న సంజీవరెడ్డి

# బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం..!

### -దోలాయమానంలో అభ్యర్థులు
### -గెలుపుపై ఎవరి ధీమా వారిదే ..

**హుస్నాబాద్, డిసెంబరు1, ప్రభాతవార్త :** గత రెండు మాసాలుగా రణగొణ ధ్వనుల మధ్య హోరెత్తి చివ రకు గురువారం తెలంగాణ రాష్ట్రంలో హుస్నా బాద్ నియో జకవర్గంలో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసి వారి భవిష్యత్తును రాసిన ఓటరు నాడిని నిక్షిప్తం చేసిన ఈ విఎం బాక్సులు సురక్షతంగా స్ట్రాంగ్‌రూంకు తరలించి భారీ రక్షణ మధ్య కాపలా కాస్తున్నారు. ఈ నేపథ్యం లో హుస్నాబాద్ నియో జకవర్గంలో 19మంది అభ్య ర్థులు పోటీలో తలప డినా అందులో ప్రధానంగా జాతీ యపార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధ్య తెలం గాణ రాష్ట్ర పార్టీ అయిన బిఆర్ ఎస్‌ల మధ్య తీవ్ర పోటీ నెల కొని ఉన్నట్లు ఓటరు నాడి ని విశ్లేషిస్తే అవగ తమవుతోంది. దీంతో పాటు ఎన్నికల అనంతరం వెలు వడిన ఎగ్జిట్‌పోల్ సర్వేలు కూడా తె లంగాణ




పోలింగ్ బాక్సులను భద్రపరిచిన దృశ్యం (ఫైల్)

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన గాలులు వీచినట్లు వారు చెబుతున్నారు. దీంతో హుస్నాబాద్ శాసనసభ అభ్య ర్థిగా రంగంలో దిగిన తనకు ఈ కాంగ్రెస్ పార్టీకి వీచిన గాలులతో పాటు తన టా లెంట్‌తో ఓటర్లను ఆకట్టుకున్న తాను హుస్నాబాద్ నియోకవర్గంలో దాదాపు గా ఇరవైవేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సా ధిస్తానని ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇక బిఆర్ఎస్ పార్టీ విషయా నికొస్తే తనకు సైతం ఓటర్లు దీవిస్తారని ప్రభుత్వం ఇంతకాలం అందించిన సంక్షేమ పథకాలతో పాటు చేసిన అభివృద్ధిపై బిఆర్ఎస్ సిట్టింగ్ అభ్యర్థి సైతం ఆశలపల్లకిలో ఊరేగుతున్నారు. ఇదిలా ఉండగా అసలు ఓటరు ఎవరికి ఓటు వేసారనేది మాత్రం అర్థం కావడంలేదు. ఎవరి ధీమాలో వారు ఉన్నప్ప టికీ తెలంగాణ రాష్ట్రం లోని ఎన్నికల సర్వేఫలి తాలు మాత్రం కాంగ్రెస్ పార్టీకి పట్టం కడుతున్నా యి. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యే వరకు అభ్య ర్థులతో పాటు అభి మానులు గుండెబిబ్బరంతో వేచి చూడాల్సి న అవసరం ఉంది. ఈ నెల 3న సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ లెక్కింపు ప్రక్రియ పూర్తికానుంది.

# నువ్వా..నేనా..?

### -ఈవీఎంలో అభ్యర్థుల భవితవ్యం -అసెంబ్లీ కా..ఇంటి కా..అభ్యర్థుల్లో నెలకొన్న సందిగ్ధత
### -గెలుపు ధీమాలో..తగ్గేది లేదంటున్న అభ్యర్థులు

**వికారాబాద్, డిసెంబర్ 01, ప్రభాతవార్త:**

అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఆదివారం ఉండటంతో బరిలో ఉన్న అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటరు మహాశయులు ఎవరిని ఆశీర్వదించి అసెంబ్లీకి పంపుతారో..ఎవరినీ ఇంటి కి పంపుతారో తేలే రోజు దగ్గరపడింది. దీంతో అభ్యర్థుల భవిత వ్యం ఈవీఎం యంత్రాల్లో దాగి ఉంది. వారి భవితవ్యం బ యటపడేందుకు కేవలం ఒక్క రోజు మాత్రమే ఉండటంతో అభ్యర్థుల్లో గెలు పు..ఓటమి లపై ఆందోళన మొదలైంది. ఎవ రైనా వారిని కదిలిస్తే మాత్రం.. గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నా రు. గెలిచేది తామే నని, ప్రభుత్వం సైతం తమదేనంటూ.. తగ్గేది లేదన్నట్లు అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ధీమా విషయంలో మేక పోతు గాంభీర్యం ప్రదర్శించినప్పటికీ.. లోలోపల మాత్రం ఆందోళన చెందుతున్నారు అభ్యర్థులు. వికారాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొం ది. పలు సర్వే సంస్థలు సైతం వీరిద్దరి ఓటమి, గెలుపు పైనా సర్వేలను బయటపెట్టింది. వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, బీఆర్ ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ ల మధ్యనే ద్వి ముఖ పోటీ ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**-మెజార్టీ తమదే నంటున్న ఇరు పార్టీల నాయకులు...**

బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కు మార్‌లు అసెంబ్లీ ఎన్నికల బరిలో నువ్వా.. నేనా..అన్న విధంగా పోటీలో నిలి చారు. ఎన్నికల పోలింగ్ నవంబర్ 30న పూర్తి అయినప్పటి నుంచి ద్వితీయ శ్రేణి నాయకులు గెలుపు తమదేనని, భారీ మెజార్టీ వస్తుందంటూ ఇరుపార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అభ్యర్థుల వద్దకు వెళ్ళి తాము భారీ మెజార్టీతో గెలుపొందుతామంటూ కబుర్లు చెప్పి అభ్యర్థుల మెప్పు పొందే ప్రయత్నం చేస్తున్నా రు. అభ్యర్థులు మాత్రం ఎవరి మాట నమ్మాలో..ఎవరి మాట నమ్మరాదో తెలియక కౌంటింగ్ రోజు కోసం ఎదురు చూస్తు న్నారు. రాత్రుళ్ళు నిద్ర కూడా పోకుండా సర్వే సంస్థల వారికి ఫోన్లు చేసి తమ పరిస్థితి ఎలా ఉంది అంటూ ఆరా తీస్తున్నారు. తామె గెలుస్తామని క్రింది స్థాయి




వికారాబాద్ నియోజకవర్గ ముఖ చిత్రం

నాయకులు చెప్పినప్పుడు కాస్తా సంతోషం అనిపిం చినా..లోలోపల మాత్రం తెలియ ని ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. ఎవరు ఎంత ఉబ్బి తబ్బిబ్బు చేసినా..కౌటింగ్ రోజు కోసం క్యాలండర్ వైపు చూస్తున్నారు. కౌంటింగ్ కు కేవలం ఒక రోజు ఉండటంతో 24 గంటలు ఎలా గడుస్తాయని గడియారం వైపు పదే పదే ఆశగా ఎదరు చూస్తున్నారు ఇరు పార్టీల అభ్యర్థులు.

**-అసెంబ్లీ కా..ఇంటి కా...**

బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్ పై గెలు పొందారు. ప్రస్తుతం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందితే అ సెంబ్లీకి పోయి నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటు పడతారని, లేని పక్షంలో అతను నమ్ముకున్న వైద్య వృత్తి కే పరి మితమవు తారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాం గ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ 2008 ఉప ఎన్నికల్లో ప్రత్యర్థిపై దాదాపు 30 వేల మెజార్టీ ఓట్లతో గెలుపొందగా, 2009 సార్వత్రిక ఎన్నికల్లో సైత గెలుపొంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రి పదవి సైతం చేపట్టా రు. తదనంతరం 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొం దితే గతంలో కంటే ఎక్కువగా వికారాబాద్ నియోజకవర్గాన్ని ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి పరిచేం దుకు కృషి చేస్తా రని, ఆయనకున్న రాజకీయ పలుకుబడితో అత్యున్నత పద వులు సైతం అధిరోహించే అవకాశాలు సైతం ప్రసాద్‌కు మార్‌కు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొం టున్నారు. అదృష్టం తిరగబడితే మాత్రం ఇంటి బాట పట్టక తప్పదని పలువురు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా.. ఇరువురి అభ్యర్థుల చూపు అసెంబ్లీ వైపు ఉండటంతో..ఓటరు మహాశయులు ఎవరినీ ఇంటికి పంపుతారో..ఎవరినీ అసెంబ్లీకి పంపుతారో మరో 24 గంటల పాటు వేచి చూడా ల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు.

# మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో పోలింగ్ ఆలస్యంతో పెరిగిన పోల్ ఓటింగ్ శాతం

### -జిల్లా వ్యాప్తంగా 56.17శాతంకు పెరిగిన పోలింగ్ నమోదు
### -3న కీసరలోని హోలీమేరి కళాశాలలోనే 5 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 1, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కొన్ని చోట్ల ఆలస్యంగ కొనసాగటంతో పోల్ ఓటింగ్ పోలింగ్ శాతం రాత్రి వరకు 56.17శాతం నమోదు జరిగింది. గురువారం సాయంత్రం 5గంటల వరకు 49.25శాతం పోలింగ్ నమోదు కాగ జిల్లా వ్యాప్తంగ పోలింగ్ పూర్తి వరకు 56.17శాతం నమోదు అయింది. అయితే గురువారం సాయంత్రం 5గంటల వరకు మాత్రం పోలింగ్ 49.25శాతంగ నమోదు కావటం జరిగిన సంగతి తెలిసిందే. అయితే సాయంత్రం 5గంటల తరువాత కూడ పలు పోలింగ్ కేంద్రాల్లో గేట్‌లోపల ఓటర్లు క్యూలో నిలబడి ఉండ టంతో పోలింగ్ పూర్తి వరకు మరింత పోలింగ్ జరిగి జిల్లా వ్యాప్తంగ పోలిం గ్ 56.17శాతం పెరిగినట్లు ఆలస్యంగ అధికారికంగ వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 6,37,839మంది ఓటర్లు ఉండగ వీరిలో 3,96,790మంది ఓటర్లు ఓటు హక్కును (62.24శాతం) వినియోగించుకు న్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో మొత్తం 4,89,043మంది ఓటర్లు ఉండగ వీరిలో 2,64,189మంది తమ ఓటు హక్కును (54.02శాతం) వినియోగించుకున్నా రు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 6,99,130మంది ఉండగ వీరిలో 3,99,752మంది ఓటు హక్కును (57. 18శాతం) మంది వినియోగించుకున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మొత్తం 4,63, 864మంది ఓటర్లు ఉండగ వీరిలో 2,49,894మంది ఓటర్లు తమ ఓటు హక్కును (53.87శాతం) వినియోగించుకున్నారు. ఉప్ప ల్ నియో జకవర్గంలో మొత్తం ఓటర్లు 5,29,416మంది ఉండగ వీరిలో 2,72,870 మంది ఓటు హక్కును (51.54శాతం) వినియోగించుకున్నారు. మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 56.17శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు ఆలస్యంగ వెల్లడించటం జరిగింది. మేడ్చల్ నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈవిఎంలు మొరాయించటం తోనూ ప్రత్యామ్నాయంగ తీసుకవచ్చె వరకు పోలింగ్ ఓ గంట పాటు నిలిచిపోవటంతో, మరి కొన్ని చోట్ల అరగంట పా టు, 15నిమిషాల పాటు మొరాయించటంతో కొన్ని కేంద్రాల్లో సాయంత్రం 5గంటల తరువాత కూడ ఆలస్యంగ పోలింగ్ జరగటం, క్యూలైన్లలో బారు లు తీరా నిలబడి ఉండ టంతో ఓటింగ్ పోలింగ్ ఆలస్యంగ కొనసాగింది. మరి కొన్ని చోట్ల పోలింగ్ సాంకేతిక సమస్యలతో నెమ్మదిగా కొనసాగటంతో నూ సాయంత్రం తరువాత కూడ గేట్ లోపల ఉన్న వారికి ఓటు హక్కును వినియోగించు కోవటానికి అవకాశం కల్పించారు. పోలింగ్ పూర్తి జరిగిన తరువాతనే ఆలస్యం గ పోలింగ్ శాతంను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగ ఓటర్లు 28,19,292 మంది ఓటర్లు ఉండగ వీరిలో 15,83,675మంది ఓటు హక్కును (56.17శాతం) మంది ఓటర్లు ఓటు హక్కును వినియో గించుకున్నారు. ఆ తరువాత అదే నవంబరు 30వ తేదీన రాత్రి ఈవిఎంల ను ఆయా నియోజక వర్గాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు తరలించి అక్కడి నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి కీసరలోని హోలీమేరి కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు కాన్వాయ్ వాహానాలతో పోలీసు బం దోబస్తు మధ్య ఈవిఎం యంత్రాలను తరలించటం జరిగింది. ఇక ఈ నెల 3వ తేదీన ఆదివారం కీసరలోని హోలీ మేరి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు జరుగనుంది.

# అందరి చూపు కొడంగల్ పైనే !!

**కొడంగల్, డిసెంబర్ 1ప్రభాతవార్త :** కొడంగల్ అంటే ఒకప్పుడు విసిరేసిన విస్తార్లా వెనుకబడిన నియోజకవర్గం. కొడంగల్ అంటే వరంగలా.. అంటూ అందరూ అవహేళనగా మాట్లాడేవారు. అయితే అదే కొడంగల్ నియోజకవర్గం ప్రస్తుతం అందరి దృష్టి కొడంగల్ పైనే అన్న ట్లుగా మారుమ్రోగుతుంది. తెలం గాణా రాష్ట్రంతో పాటు ఇటు ఆంధ్రా, అటూ సరిహద్దు కర్నాటక రాష్ట్రాల్లోను కొడంగల్‌లో అభ్యర్దుల గెలుపు ఓటమ లపై చర్చల జోరందదుకున్నా యి. కొడంగల్‌లో అభ్యర్దుల గెలుపుపై భారీగా బెట్టింగులు కొనసాగుతున్నాయి. తెలంగాణాతో పాటు ఆంధ్రా, కర్నాటక రాష్ట్రా ల్లోను బెట్టింగుల జోరు కొనసా గుతుండడంతో రూ.కోట్లు దాటి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఏ గ్రామంలో నల్లురు కూడినా ఇక్కడ అభ్య ర్దుల గెలుపుపైనే ప్రధాన చర్చ అన్న చందంగా మారింది. కొడంగల్‌లో ఫలానా అభ్యర్ధి గెలుస్తాడని బెట్టింగుకు ముందుకు వస్తే కాదు మా పార్టీ అభ్యర్ధి గెలుస్తాడంటూ పందెనికి రెఢీ అవుతున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పీసీసీ అధ్య క్షులు ఫైర్‌బ్రాండ్ రేవంత్‌రెడ్డి గెలుపుపై రూ.100కు రూ.1000 అనే తీరులో బెట్టింగుల జోరు ఉపం దుకుంది. మరోపక్క అభ్యర్ధి మెజార్టీపై కూడ బెట్టిం గుల జోరు కొనసా గుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కొడంగల్ నియో జకవర్గం రాష్ట్ర ఎన్నికల సంఘంతో పాటు ప్రధాన ఎన్నికల సంఘం దృష్టిని ఆకర్శించడంతో పాటు రాష్ట్ర, దేశ స్థాయిలో జాతీయ నాయకులను సైతం కదిలించిన నియోజకవర్గంగా కొడంగల్ నియోజకవర్గం ప్రాధాన్యతను సంతరిం చుకుంది. ఒక దశలో తెలం గాణా రాష్ట్రంలో అధికారం లోకి రాకున్నా ఫర్వా లేదు కానీ కొడంగల్‌లో పీసీసీ అధ్యక్షులు, ఫైర్‌బ్రాండ్‌ను ఓడించాలనే పట్టుద లతో అధికార పక్షం పావులు కదిపింది. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్ది పోటీలో ఉన్న అభ్యర్దులు కోట్లల్లో ఖర్చు చేసేందుకు వెనుకాడలేదు. ఎన్నికలకు రెండు రోజుల ముందు భారీగా డబ్బుల పంపిణీ జరిగిందని రాజకీయ విశ్లేష కులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రి యకు కౌంట్‌డౌన్ ప్రారంభం సమయం దగ్గర పడుతుండడంతో అన్ని పార్టీల్లో ఉత్కం ఠ నెలకొంది. గెలుపు ఓటములపై ఎవరి అంచనాలు వారు లెక్కలేసుకుంటున్నారు.

# నర్సాపూర్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ హోరాహోరీ పోరులో గెలుపెవరిదో..

**నర్సా పూర్, డిసెంబర్ 1.ప్రభాతవార్త:** నర్సా పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొంది. ఈ రసవత్తర పోటీలో గెలుపెవరి దోనని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీ తరపున సునీతాలక్ష్మారెడ్డి, కాంగ్రెస్ తరపున ఆవుల రాజిరెడ్డి, బిజెపి తరపున ముర ళీయాదవ్‌తో మరో 8 మంది స్వతంత్ర అభ్యర్థు లుగా నిలిచారు.

కాగా బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం సాగించారు. ఈ మూడు ప్రదాన పార్టీల మధ్యే తీవ్రమైన పోటీ నెలకొంది. నర్సా పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బిఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతుగా జోరుగా ప్రచారం కొనసాగించారు. వీరు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. దీంతో నర్సా పూర్‌లో బిఆర్ ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి గెలుపు ఖాయ మ న్నా దీమాను బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా వుండగా కాంగ్రెస్ అభ్య




నర్సా పూర్ అసెంబ్లీ నియోకవర్గం యొక్క చిత్ర పటం (మ్యాప్)

ర్థి గా ఆవుల రాజిరెడ్డికి టికెట్టు రాగా అసమ్మతి నేతలైన ఆంజనేయులుగౌడ్, రవిందర్‌రెడ్డి మద్దతు తెలిపి జోరుగా ప్రచారం సాగించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి గ్రామాల్లో ఇంటింటికి తిరు గుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రచారం చేశారు. అంతేగాక కాంగ్రెస్ మేనిపెస్టోలో 6 గ్యారంటీ పథకాలను తప్పక అమలుచేస్తామని వారు ప్రచా రం నిర్వహించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి విజయం ఖాయ మన్నా దీమాను ఆ నాయకుల్లో వ్యక్తం అవుతుంది. అయితే బిజెపి అధిష్టానం ఎర్రగొల్ల మురళీయా దవ్‌కు ఎమ్మెల్యే టికెట్టును కేటాయించింది. దీంతో బిజెపి అభ్యర్థి మురళీయాదవ్ ఒంటరిగానే గ్రామా ల్లో ఇంటింటికి తిరిగి తన ప్రచారాన్ని కొనసా గిస్తున్నారు. పిఎం నరేంద్రమోడి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను బిజెపి మేనిపెస్టోను ఆయన ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. తనదైన శైలిలో ప్రజల్లో బిజెపిపై ఆసక్తి కలిగించేలా చేస్తుకున్నారు. ఈవి ధంగా నర్సా పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో మూడు ప్రధాన పార్టీ అభ్యర్థులు జోరుగా ప్రచారాలను సాగించారు. కాగా ప్రజలు ఎటు వైపు మొగ్గు చూపుతారో, ఎవరు ఎమ్మెల్యేగా గెలుపొందుతారో నని వారు ఎదురుచూస్తున్నారు. కాగా ఈ నెల 30న పోలింగ్ జరుగగా 88 శాతం ఓట్లు పోల య్యాయి. కాగా ఈ నెల 3 వ తేదీన ఓట్ల కౌంటిం గ్‌లో ఎవరు ఎమ్మెల్యేగా గెలుపొందుతారో వేచి చూడాల్సిందేమరి..



పోలీసు కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## ఘనంగా పోలీసు కిష్టన్న వర్ధంతి

**చిన్నకోడూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** తెలంగాణ సాధన కోసం పోలీసు కిష్టన్న ప్రాణత్యాగం చేశారని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షులు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. పోలీసు కిష్టన్న 14వ వర్ధంతి సందర్భంగా చిన్నకోడూరు ముదిరాజ్ ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షులు మేడికాయల వెంకటేశం అధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ పోలీసు కిష్టన్న మలిదశ ఉద్యమంలో రాష్ట్రం సిద్ధించే వరకు పోరా టం అగకూడదని నినదిస్తూ తన సర్వీస్ రివల్వర్‌తో కాల్చుకొని ప్రాణత్యాగం చేసిన తొలి అమరుడు పోలీసు కిష్టన్న అన్నారు. కిష్టన్న త్యాగాన్ని జాతి ఎప్పుడు మరువదన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కోర బోయిన సుధాకర్, కొత్త బాల్‌రాజు, ఇట్టబోయిన బాలపోశయ్య, బోయిని అనం దం, పసుపుల సాయిలు, ముత్తయ్య, బుచ్చెలి రమేష్, దుర్గం ఎల్లం, ఉప్పర మేన శంకర్, రామంచ రాములు, ఇట్టబోయిన లక్ష్మణ్, గణేష్ పాల్గొన్నారు.

**చాట్లపల్లిలో...**



కానిస్టేబుల్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 1 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 14వ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన లో జరుగుతున్న అన్యాయాలను తట్టుకోలేక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలనే ఆకాంక్షతో విధుల్లో ఉండగా తుపాకీతో కాల్చుకొని ప్రాణాలు అర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కొండపోచమ్మ చైర్మన్ న్యాలమడుగు హనుమంతరెడ్డి, మాజీ ఎంపిటిసి సావిత్రి నర్సింలు ముదిరాజ్, జగదేవ్‌పూర్ మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు కదుర్ల అంజయ్య, నాయకులు బరిగె భాస్కర్, బరిగె నర్సింలు, చంద్రయ్య, శ్రీను, చిలుముల కిష్టయ్య, కనకయ్య, ఉప్పలయ్య, మల్లయ్య, శ్రీనివాస్, చంద్రం, భాను, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పది రోజుల పాటు ఉచిత వైద్యం

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** సిద్దిపేట సురభి మల్టీ స్పెషాలిటీ అసుపత్రిలో 1 నుంచి 10వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు అసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శివరామచారి తెలిపారు. శుక్రవారం అయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు వైద్యం అందుబాటు లో ఉండాలన్న ఉద్దేశంతో పది రోజుల పాటు ఉచిత వైద్యాన్ని అందించడం తో పాటు ల్యాబ్‌పరీక్షలలో 50 శాతం రాయితీ కల్పించడం జరుగుతుంద న్నారు. జనరల్ మెడిసిన్ పీడీయాట్రిషన్ అర్థో జనరల్ సర్జన్, గైనకాలజిస్టు లకు సంబంధించిన సేవలను అందించడం జరుగుతుందన్నారు. అసుపత్రి లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో వైద్యులు శివ, అపూర్వ, వెంకటరమణారెడ్డి, స్రవంతి, హర్ష, పిఆర్ఓ పరుశరాములు పాల్గొన్నారు.

# ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు

### -పరిశీలించిన మేడ్చల్ జిల్లా ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్, సిపి
### -కీసరలోని హోలీ మేరి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లో..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి డిసెంబరు 1, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి కీసర మండలం బోగారంలోని హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, రాచకొండ పోలీస్ కమిషనర్ డిఎస్ చౌహాన్, జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్‌కె జైన్, పూర్వాగార్గ్, అమన్‌మిట్టల్‌లు సందర్శించి ఏర్పాట్లను పరిశీలిం చారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని బోగారంలోని హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను వారు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గా ల ఓట్ల లెక్కింపు ఈ కళాశాలలో ఐదు సెంటర్లలో జరుగుతున్నందున ప్రశాంత వాతావరణంలో జరగటానికి అధికార యంత్రాంగం సిద్దం చేస్తుంది. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీన రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్ జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందన్నారు. అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగ పరిశీలించి అధికారులకు, సూచనలు, సలహాలు చేయటం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండ అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండే లా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఎజెంట్ల రాకపోకల కోసం వేరువేరు మార్గాల్లో ఏర్పా టు చేసిన బారికేడ్స్‌ను పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండ సాఫీగ జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీనిలో వారితో పాటు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిసిపి జానకి, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ హైస్కూల్‌లో అగ్నిప్రమాదం

**సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని హైదరా బాద్ రోడ్డులోగల కాకతీయ హైస్కూల్‌లో శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఫ్రిజ్, ఇతర వస్తువులు కాలిపోయాయి. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిందని, పోరపాటున విద్యార్థులకు ఏదైనా జరిగితే ఏమిటని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు నిలదీశారు. కొద్దిసేపు సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. నిబంధలనకు విరుద్దంగా పాఠశాలను నడుపుతుండడంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. మరో సారి ఇలాంటి ప్రమాదం జరగకుండా చూస్తామని సిబ్బంది హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లిదండ్రులు శాంతించారు.



అగ్నిప్రమాదంలో కాలిపోయిన సామాగ్రి

# ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పదవి ఎవరిని వరించేనో..?

## మొత్తం ఓట్లు 5,29,416.. ఓటు వేసిన వారు 2,72,870

## ఓటింగ్‌లో మహిళలదే హవా.. మొత్తం 51.54 శాతం నమోదు




ఉప్పల్ అసెంబ్లీ ముఖ చిత్రం

**ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో గురువారం జరిగిన పోలింగ్ గత ఎన్నికల మాదిరిగానే 51.54 శాతం పోలింగ్ నమోదైంది. గత 2019లో జరిగిన ఎన్నికల్లో 2,27,336 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, ఈ విడత మరో 45 వేల మంది అధికంగా ఓటువేశారు. అధికారుల నివేదిక ప్రకారం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో మొత్తం 4,41,145 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 2,31,033మంది, మహిళలు 2,10,020మంది, ఇతరులు 92 మంది ఉన్నారు. అప్పట్లో ఓటువేసిన వారిలో పురుషులు 1,18,109 మంది, మహిళలు 1,09,247 మంది, ఇతరులు 10 మంది ఓటు వేశారు. మొత్తం 2,27,336మంది ఓటర్లు గతంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ విడత జరిగిన ఎన్నికల్లో మొత్తం 5,29,416 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 2,75,229 మంది, పురుషులు 2,54,147 మంది, ఇతరులు 40 మంది ఉన్నారు. వీరిలో మొత్తం గురువారం 2,72,870 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియో గించుకున్నారు. వీరిలో పురుషులు 1,39,531 మంది ఓటు వేయగా, మహిళలు 1,33,33 మంది, ఇతరులు ఏడుగురు ఓటు వేశారు. పురుషులు 50.7 శాతం మంది ఓటు వేయగా, మహిళలు 52.46 శాతం మంది ఓటు వేశారు. 2019 ఎన్నికల్లో మాదిరిగానే 51.54 శాతంగా నమోదు కావడం గమన్హారం. మరో 2,56,546 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోలేదు.

**అంత చిక్కని ఓటరు నాడి :** ఉప్పల్ నియోజకవర్గంలో ఓటర్ల నాడి అంతు చిక్కడంలేదు. ఒక్కోప్రాంతంలో ఒక విధంగా ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. అయితే పోలింగ్ జరిగిన తీరు పోటీలో ఉన్న అభ్యర్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్క విధంగా పోలింగ్ జరుగడంతో ఓటరు నాడి అంతు చిక్కడం లేదు. కొన్ని చోట్ల భారీగా ఓటింగ్ నమోదు కాగా, మరికొన్ని చోట్ల ఒకే పార్టీకి ఓటర్లు ఓటు వేశారు. వెనుకబడిన ప్రాంతాలు, పాతకాలనీల్లో 3 ప్రధానపార్టీలకు ఓట్లు పడే అవకాశముంది. విద్యావంతులు, ఉద్యోగులు ఓట్లు అన్ని పార్టీలకు పంచుకున్నట్లు తెలుస్తోంది. సీమాంధ్ర సెటిలర్లు బిఆర్ఎస్ వ్యతిరేక పార్టీల వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఈ సారి ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ అభ్యర్థులు కూడా అధిక సంఖ్యలో రంగంలో ఉండడంతో ఏ పార్టీ ఓటు బ్యాంకుకు గండి పెడుతారోనే విషయం అంతు చిక్కడం లేదు. అయితే విజయం ఎవరిని వరించినా పది నుంచి 20వేల ఓట్ల మెజార్టీతో గట్టెక్కే అవకాశాలు ఉన్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**మొత్తం 51.54 శాతం ఓటింగ్ నమోదు :** ఉప్పల్ అసెంబ్లీ పరిధిలో 358 పోలింగ్ కేంద్రాలు ఉండగా, చాలా చోట్ల తక్కువ సంఖ్యలో ఓటింగ్ నమోదు అయ్యింది. ఈ విడత కూడా గతంలో మాదిరిగానే యాధృచ్ఛికంగా 51.54 శాతం పోలింగ్ నమోదు కావడంతో గతంలో కంటే సుమారు 45 వేల ఓట్లు అధికంగా పోలింగ్ అయ్యాయి. కొత్తగా భారీగా ఓట్లు నమోదు కావడంతో వీరు ఓట్లు ఎవరికి పడి ఉంటాయో అనేకిగా మారింది. కొత్తగా వచ్చిన ఓట్లు ఎవరికి మేలు చేకూరుతుందో వేచి చూడాల్సిందే. గత ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి బేతి సుభాష్‌రెడ్డికి మొత్తం 1,17,281 ఓట్లురాగా, తన సమీపప్రత్యర్థి తూళ్ల వీరేందర్‌గౌడ్‌కు 69049 ఓట్లు వచ్చాయి. ఇక 3వ స్థానంలో నిలిచిన బిజెపి అభ్యర్థి ఎన్ వి ఎస్ఎస్ ప్రభాకర్‌కు 26176ఓట్లు మాత్రమే వచ్చాయి. అప్పట్లో బేతి మొత్తం 48232 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో మొత్తం 2,27,336 మంది ఓటు వేయగా, ఈ విడత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 2,72,870 ఓట్లు పోల్ అయ్యాయి. కాగా ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా పోలింగ్ 51.54 శాతం నమోదు కావడం గమనార్హం. 90వేల నుంచి లక్ష ఓట్లు సాధించుకున్న అభ్యర్థి విజయం ఖాయంగా తెలుస్తోంది.

**కీసర హోలీమేరి కళాశాలలో ఓట్ల లెక్కింపు :** ఉప్పల్ నియోజకవర్గంతోపాటు మరో 3నియోజకవర్గాలు కలిపి కీసరలోని హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 3వ తేదిన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పోటీల్లో ఉన్న అభ్యర్థుల భవితవ్యం ఓటింగ్ యంత్రాల్లో భద్రంగా ఉంది. అసెంబ్లీ పరిధిలోని 386 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ యంత్రాలను గురువారం సాయంత్రం 7 గంటలకు అధికారులు కీసరలోని హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాలకు తరలించారు. ఈనెల 3న అక్కడే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు ఎన్నికల అధికారి అభిషేక్ అగస్త్య, తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డిలు తెలిపారు.

## ఎల్‌బినగర్ నియోజకవర్గంలో 49.07% పోలింగ్

**ఎల్‌బినగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గంలో 49.07 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని 573 బూతులలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 5,93,712 ఓటర్లకుగాను 2,91,347 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎల్బీనగర్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు. అందులో పురుషులు 1,49,827, మహిళలు 1,41,492, ఇతరులు 28 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## దేవాలయాలను సందర్శిస్తున్న అభ్యర్థులు



కాశీ విశ్వనాథుడి దేవాలయాన్ని సందర్శించిన సంరెడ్డి సురేందర్‌రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఎన్నికల రణరంగంలో గత నెల రోజులుగా తల మునకలైన అన్ని పార్టీల అభ్యర్థులు పోలింగ్ ముగియడంతో కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడుపుతున్నారు. మరికొందరు తమకు విజయాన్ని ఇవ్వాలని కోరుతూ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. మలక్‌పేట బిజెపి అభ ్యర్థి, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి వారణాసి కాశీవిశ్వనాథుడి దేవాలయం, కాలభైరవుడి దేవాలయం, మృత్యుంజయ దేవాలయాలను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు.

## శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవాలు

**మలక్‌పేట, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఓల్డ్ మలక్‌పేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి ధ్వజస్థంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు డిసెంబర్ 2వ తేదీనుండి 4వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాలయ ఐర్మన్ బుగుడల సుదర్శన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2వ తేదీ శనివారం సాయంత్రం స్వస్తివాచనం, గణపతిపూజ, పుణ్యాహవచనము, పంచగవ్య ప్రాచనం, రక్షబంధనం, అఖండ దీపారాదన, అంకురారోహణము, నవగ్రహ సర్వతో భద్రమండలి పూజ, యాగశాల ప్రవేశం, జలదివాసం, నైవేద్యం, హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు, 3వ తేది ఆదివారం ఉదయం గణపతి పూజ, సర్వతో భద్రమండలి పూజ, యంత్రపూజ, గణపతి, గౌరి, నవగ్రహ, అష్టవాక్పాలక వాస్తు, మన్యు సూక్త హోమాలు, ధాన్యదివాసం, నైవేద్యం, హారతి తీర్థ ప్రసాదం, సాయంత్రం 5గంటలకు అవాహనాది దిక్పాలక హవనం, తదితర పూజా కార్యక్రమాలు, 4వ తేదీ సోమవారం ఉదయం గణపతి పూజ, మూలమంత్ర హవనం, శ్రీశ్రీశ్రీ ఆంజనేయస్వామివారి ధ్వజ స్థంభ యంత్ర ప్రతిష్య, బలి ప్రధానం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని బాబు సుదర్శన్ కోరారు.

## ఉప్పల్‌లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ




ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎల్‌ఎఫ్‌డిసి విద్యార్థులు, ఉపాధ్యాయులు

**ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.జయంతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ప్రశాంత్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా తమ వంతు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల మీదుగా ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం



కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు

**ఎల్‌బినగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థనం వారి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలోని వెంకటేశ్వర దేవాలయ 39వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ సమక్షంలో, వేదపండితులు కృష్ణమాచార్యులు, వంశీధర చార్యులు, రామ కృష్ణచార్యులు, శ్యామ్‌సుందర్‌ల వేదొచ్చారణాల మధ్య కన్నుల పండుగగా జరిగిన స్వామి వారి కళ్యాణాన్ని చూడడానికి ఉదయం నుండే భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. గోవింద నామంతో మారుమోగింది. అనంతరం భక్తులు అన్నప్రసాద వితరణ లో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ ఛైర్మన్ కోరుపోలు భాస్కర్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు గండు ధనంరెడ్డి, ఆలయ కమిటీ కోశాధికారి పి.వి.రమణ, వేణుబాబు, సుబ్బారావు, మురళికౌండిన్య , శ్రీనివాస్‌రావు, బోగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కరంచంద్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం : బిఆర్ఎస్ నాయకులు



సమావేశంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

**నేరెడ్‌మెట్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గం, యాప్రాల్ పరిధిలోని పోలింగ్ బూత్ వద్ద బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కరంచంద్‌పై జరిగిన దాడిని ఖండిస్తు, శుక్రవారం మల్కాజిగిరి నియోజక వర్గం, నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జీకే హనుమంతరావు నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా నాయకులు కరంచంద్, రావుల అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, మధుసూదనరావులు మాట్లాడుతూ గురువారం కరంచంద్‌పై జరిగిన దాడిని ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు సర్వసాధారణమని, దాన్ని వ్యక్తిగతంగా తీసుకొని నాయకులపై దాడి చేయడం సరికాదన్నారు. ఎలక్షన్స్‌లో గెలిచిన, ఓడిన ప్రజల మధ్యలోనే ఉంటామన్నారు. తనపై దాడి చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, వారి అనుచరులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులకు పాల్పడవద్దని నాయకులు కోరారు.

## నాదర్‌గుల్‌లో అయ్యప్ప మాలధారణలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో శుక్రవారం సామూహిక అయ ్యప్ప స్వామి మాలధారణ దీక్షల కార్యక్రమం జరిగింది. గ్రామంలోని సాయిబాబా దేవాలయం పక్కన ఉన్న అయ్యప్ప స్వామి సన్నిధానంలో మహా గురుస్వాములు పాలుబాయి అశోక్, బంగారు శంకర్‌ల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు ముప్పై మంది అయ్యప్ప మాల ధారణ చేశారు. భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డితో పాటు తిరుపల్లి సుధాకర్ యాదవ్, మర్రి నర్సింహారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, మర్రి శ్రీధర్‌రెడ్డి, మర్రి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అయ్యప్ప దీక్షలు చేపట్టారు.

## సామ విజయం ఖాయం: పవన్‌కుమార్

**ఎల్‌బినగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. గత నెల రోజులుగా తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో సామ రంగారెడ్డి గెలుపుకొరకు రాత్రి పగలు దేశం కోసం, ధర్మం కోసం, పార్టీ కోసం అన్ని రకాల ఇబ్బందులను ఎదుర్కొని కష్టపడి పనిచేసిన కొత్తపేట డివిజన్ బిజెపి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరబోతుందని, ఎమ్మెల్యేగా సామ రంగారెడ్డి రాబోతున్నారని అన్నారు.

# రేపు తేలనున్న మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థుల భవితవ్యం

## బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిల్లో గెలిచేదెవరో? అంతటా ఉత్కంఠ



**సరూర్‌నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలోని కీలక నియోజక వర్గాల్లో ఒకటైన మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం రేపు తేలనుంది. జిల్లాలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద అత్యధిక సంఖ్యలో ఓటర్లు గల నియోజకవర్గాల్లో ఒకటైన ఈ నియోజకవర్గానికి చాలా ప్రత్యేకత ఉంది. గ్రేటర్ హైదరాబాద్ (జిహెచ్‌ఎంసి) పరిధి కిందకు వచ్చే ఆర్‌కెపురం, సరూర్‌నగర్ డివిజన్లు, గ్రేటర్‌కు ఆనుకొని ఉన్న రంగారెడ్డిజిల్లా కిందకు వచ్చే మీర్‌పేట్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలు, రూరల్ ఏరియాలైన మహేశ్వరం,కందుకూరుమండలాలు మహేశ్వరం నియోజకవర్గంలో ఉండడం విశేషం. మలక్‌పేట్ నియోజకవర్గం పునర్విభజనలో కొత్తగా ఏర్పడిన తర్వాత 2009 వసంవత్సరంలో తొలి సారిగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ ప్రోత్సాహంతో పోటీ చేసిన నాటి గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి విజయం సాధించి ఏకంగా దేశంలోనే మొట్టమొదటి మహిళా హోం మంత్రిగా అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బాధ్యతలు చేపట్టడం ఈ నియోజకవర్గానికి ఉన్న ప్రత్యేకతల్లో ఒకటి. అదే విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చినా ఉమ్మడి రాష్ట్రంలోనే 2014వ సంవత్సరంలో ఏప్రిల్ నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ హుడా ఛైర్మన్, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి టిడిపి తరపున పోటీ చేసి భారీ మెజార్టీతో గెలుపొంది తన 20సంవత్సరాల తన ఎమ్మెల్యే కలను ఈ నియోజకవర్గంలోనే సాకారం చేసుకోవడం విశేషం. అప్పట్లో సబితా ఇంద్రారెడ్డి ఎన్నికల్లో పోటీ చేయలేదు. అయితే 2014వ సంవత్సరం మే 16న ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం జూన్ 2వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవిర్భవించి టిఆర్ఎస్ ప్రభుత్వ పాలన మొదలైన సంగతి విదితమే. అయితే కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో 2018వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి సబితా ఇంద్రారెడ్డి, టిఆర్ఎస్ నుండి తీగల కృష్ణారెడ్డి, బిజెపి నుండి అందెల శ్రీరాములు యాదవ్ పోటీ చేయగా విజయం మాత్రం సబితా ఇంద్రారెడ్డిని వరించింది. ఆ తర్వాత ఆమె టిఆర్ఎస్‌లో చేరి తెలంగాణ రాష్ట్రంలో తొలి మహిళా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

**ఈ ఎన్నికల ఫలితాలపైనే అందరికీ ఉత్కంఠ!**

కాగా తాజాగా జరిగిన మహేశ్వరం నియోజకవర్గ ఎన్నిక ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. కొత్తగా నియోజకవర్గం ఏర్పడిన తర్వాత నాలుగవ సారి జరుగుతున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ (టిఆర్ఎస్) నుండి సబితా ఇంద్రారెడ్డి, కాంగ్రెస్ నుండి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బిజెపి నుండి అందెల శ్రీరాములు యాదవ్, బిఎస్‌పి నుండి కొత్త మనోహర్‌రెడ్డితో పాటు మొత్తం 27 మంది పోటీ చేస్తున్నారు. వీరిలో ప్రధానంగా బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపిల మధ్యే ఉంది. 2018లో కాం గ్రెస్ నుండి గెలిచి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం బిఆర్ఎస్‌లో చేరి తన పని తీరుతో ప్రజలకు చేరువైన మంత్రి ఆ పార్టీ నుండి పోటీ చేయగా 2018లో ఓటమి చెందిన అందెల శ్రీరాములు యాదవ్ గత ఐదు సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధికోసం, ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేస్తూ ఈ సారైనా గెలవాలనే గట్టి పట్టుదలతో ఎన్నికల్లో పోటీ చేశారు. ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే ఎవ్వరూ ఊహించని విధంగా అనూహ్యంగా ఈ నియోజకవర్గం నుండి మేడ్చెల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పోటీ చేశారు. స్థానిక కాంగ్రెస్ నేతలు టిక్కెట్ కోసం పోటీ పడ్డా చివరకు కెఎల్‌ఆర్‌ను అధిష్టానం ఎంపిక చేయడంతో ఆయన తక్కువ సమయంలోనే సాధ్యమైనంత ఎక్కువప్రచారం చేశారు. త్రిముఖ పోటీ జరిగిన ఈ నియోజక వర్గంలో గెలుపు ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠభరితంగా మారింది.

**మంగళ్‌పల్లి సివిఆర్ కాలేజీలో కౌంటింగ్**

ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లిలోని సివిఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం మహేశ్వరం నియోజకవర్గ కౌంటింగ్ జరుగనుంది. కాలేజీలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని పిజి బ్లాక్‌లో ఆ రోజు ఉదయం కౌంటింగ్ జరుగుతుంది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఇవిఎంలలోని ఓట్ల లెక్కింపు చేస్తారు. రౌండ్ రౌండ్‌కు ఫలితాలు వెలువడుతాయి. భారీ ఓట్ల నేపథ్యంతో మధ్యాహ్నం వరకు గానీ ఆ తర్వాత గాని పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

## ఎల్‌బినగర్‌లో బిఆర్ఎస్ జండా ఎగర వేస్తాం : బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సుధీర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బిజెపి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినప్పటికీ పార్టీ శ్రేణులు బ్రహ్మాండమైన ప్రచారాన్ని నిర్వహించారని బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించి తీరుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సుధీర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు తన విజయం కోసం కష్టపడిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తారని నమ్మకం తనకు ఉందని నియోజక వర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటామన్నారు. ఎల్బీనగర్ నెంబర్ వన్ స్థానానికి తీసుకువెళ్లడమే ప్రధాన లక్ష్యం అన్నారు. తనను ఓడించడానికి బిజెపి నేతలు అనేక ఆరోపణలు చేశారని, బిజెపి మూడవ స్థానానికే పరిమితవుతుందన్నారు. మార్నింగ్‌వాక్ చేస్తున్న తనపై దొంగలు అని అవహేళన చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అవగాహన లేని రాజకీయనాయకులు ప్రజలకు ఏమి సేవచేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యక్తిగత ఆరోపణలు చేశారని అయితే నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధిని మేము చేస్తామని కాంగ్రెస్, బిజెపి నాయకులు చెప్పకపోవడం వారి దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు. దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనే వ్యక్తితో నామినేషన్ వేయించారని ఈ సారి నాది బకెట్ గుర్తంటూ ఓటర్లను తప్పుదారి పట్టించడానికి కాంగ్రెస్, బిజెపి నాయకు లు కుట్ర చేశారని ఆరోపించారు. నిరాధారమైన అసత్య ఆరోపణలుచేస్తూ వారు ప్రచారానికి పెద్దపీట వేశారని, ఇటువంటి రాజకీయ నాయకులను మార్చాల్సిన అవసరం ఉందని, త్వరలో కాలమే సమాధానం చెబుతుంది అన్నారు. ఎన్నికలలో సహకరించిన నియోజకవర్గ ప్రజలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉప్పల్‌లో ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్ప మహాపడి పూజలో పాల్గొన్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ఉప్పల్‌డివిజన్ బిఆర్ఎస్ నేత జెట్ట కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పూజలు చేయడం అభినందనీయమన్నారు. అయ్యప్ప భక్తులకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. అయ్యప్ప పూజలతో భక్తిభావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ, సుక్క కిరణ్, జెట్ట కిషోర్, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌చారి, కె.ప్రదీప్ రెడ్డి పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రానున్న కాంగ్రెస్ పార్టీ



లక్ష్మినారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర పరిశ్రమల సంస్థ మాజీ ఛైర్మన్ అమరవాది లక్ష్మినారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా టిపిసిసి కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రానుందన్నారు. బిఆర్ఎస్ నియంతృత్వ పాలనకు ప్రజలు ముగింపు పలికారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మెనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దాసు, వెంకటమ్మ, ఇందిర, హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపు ఎల్.బి.నగర్ ప్రజల గెలుపు : కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కి

### బీఆర్ఎస్ అహంకారానికి ప్రజలు ముగింపు పలుకనున్నారు... అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా...



విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కిగౌడ్

**హయత్‌నగర్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి మధుయాష్కిగౌడ్ ధీమా వ్యక్తం చేశాడు. శుక్రవారం సాయంత్రం ఆయన వనస్థలిపురంలోని హరిణవనస్థలిలో విలేకరులతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గెలుపు ఎల్.బి.నగర్ ప్రజల గెలుపు అన్నారు. అధికార పక్షం ఎన్ని కుట్రలు పన్నినా ప్రజాభిమానం కలిగిన తనను అడ్డుకోలేక పోయారన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ అవినీతి, అసమర్థ పాలనను ఓడించేందుకు సిద్ధమయ్యారని ఈనెల 3న అది స్పష్టమవుతుందన్నారు. అధికార పక్ష నాయకుల అహంకారం వారి పతనానికి కారణమయ్యిందన్నారు. అభివృద్ధి పనులనేవి ఎవరు అధికారంలో ఉన్నా చేయాల్సిందేనని... తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక తాను కీలకమైన పదవులో కొనసాగే అవకాశాలున్నాయని... నియోజకవర్గంలోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తనను స్థానికేతరుడిగా ప్యారాచూట్‌గా చెప్పడం హాస్యాస్పదమన్నారు. తాను హయత్‌నగర్ స్థానికుడినని, విదేశాలకు వెళ్లినా, నిజామాబాద్‌లో ఉన్నా తన స్థానికత హయత్‌నగర్‌గానే ఉంటుందన్నారు. సమయాభావం వల్ల డివిజన్లలోని ఆయా నియోజకవర్గ ప్రజలను నేరుగా కలువలేక పోయానన్నారు. ఎల్.బి.నగర్‌లోని తన ఆప్తులు, స్నేహితులు తనకు మద్దతుగా ప్రచారంలో పాల్గొని విజయంలో పాలుపంచుకోనున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలప్రక్రియ ప్రారంభంలో తనను ఇష్టానుసారంగా దుర్భషలాడిన సుధీర్‌రెడ్డికి ఓటమి కనుసన్నల్లో కన్పించడంతో దానికి కారణాలు వెతకడం కన్పిస్తోందన్నారు. తనపై క్రిమినల్ కేసులున్నాయని చెబుతున్న సుధీర్‌రెడ్డి వాటిని నిరూపించాలన్నారు. అభివృద్ధి ధ్యేయంగా తాను పనిచేస్తానని నిజామాబాద్‌లో నేను చేసిన అభివృద్ధి పనులను తెలుసుకుని మాట్లాడాలని హితువు పలికారు. ఏదేమైనా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజలకు చేరవేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానన్నారు.

## విజయం మాదే అని అభ్యర్థుల ధీమా

### బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం

## ఈవీఎం బాక్స్‌లలో అభ్యర్థుల భవిత

**ఎల్.బి.నగర్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికలలో తామే విజయం సాధిస్తామని ధీమాతో ఉన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు ఎవరికి వారు తామే ఎన్నికలలో విజయం సాధిస్తామని దీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని 2,91,347 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 48 మంది అభ్యర్థులు ఎన్నడూ లేనివిధంగా పోటీలో నిలిచారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎన్నికలలో భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల్లో ఓటు ఉపయోగించుకోవడానికి నాలుగు ఈవిఎం పాడ్లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం ఈవీఎం బాక్స్లో భద్రంగా ఉంది. అయితే ఎన్నికలలో అదృష్టం మాకే కలిసి వస్తుందని పోటీలో ఉన్న అభ్యర్థులు భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు ఎన్నికలలో విజయకేతనం ఎగురవేస్తామని అంచనాతో ఉన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో చేసిన అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు తమకు కలిసి వస్తాయని, అభివృద్ధికి ప్రజలు పట్టం కడతారని బిఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ గాలివీస్తోందని, ఇందిరమ్మ రాజ్యానికే ప్రజలు పట్టంకడతారని, ప్రభుత్వవ్యతిరేకత తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ ధీమాతో ఉన్నారు. కేంద్రంలో ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తుందని, తెలంగాణలో కూడా డబుల్‌ఇంజన్ సర్కార్‌ను ప్రజలు కోరుకుంటున్నారని, తమ విజయం తథ్యమని బిజెపి అభ్యర్థి సామ రంగారెడ్డి అంటున్నారు. ఎన్నికల పోలింగ్ ప్రారంభంనుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ అనుచరులతో ఎప్పటికప్పుడు ఓటింగ్ సరళి పై తమకు అనుకూలించే విధానాలపై ఎప్పటికప్పుడు ఆరా తీసే పనిలో ఉన్నారు. ఎల్బీనగర్ లో జరిగిన ఎన్నికల ఓటింగ్ శాతం తమకే కలిసి వస్తుందని ఆయా అభ్యర్థులు తమ అనుచర వర్గంతో చర్చించుకుంటున్నారు. విజయానికి కొన్ని గంటల దూరంలో ఉన్నామని ఎవరికి వారు చర్చలు జరుపుకుంటున్నారు. ఈవీఎం బాక్స్ లో భద్రంగా ఉన్న అభ్యర్థుల భవితవ్యం ఎవరిని వరిస్తుందో చూడాల్సిందే.

**సరూర్‌నగర్ స్టేడియం వద్ద పటిష్ట భద్రత**

**రేపు ఓట్ల లెక్కింపు...** ఎల్‌బినగర్ నియోజకవర్గం శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఆదివారం జరగనున్నాయి. ఎన్నికల అనంతరం ఈవీఎం పాడ్లను ఎన్నికల అధికారులు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం స్ట్రాంగ్ రూమ్లో భద్రపరిచారు. ఆదివారం ఓట్ల లెక్కింపు ఉన్న నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బలగాల నేతృత్వంలో పటిష్ట బందోబస్తును పోలీసులు ఏర్పాటు చేశారు.